www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

విలేకరులు కావలెను

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 173 | శనివారం 15.08.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

## కేంద్రం కీలక నిర్ణయం..

### 'కులం' కాలమ్ పునరుద్ధరణ



- జనగణన 2027కు కేంద్రం కీలక అడుగు
- సమగ్ర కుల గణనతో 40 ప్రశ్నల ప్రశ్నావళి
- స్వాతంత్ర్యం తర్వాత తొలిసారి సమగ్ర కుల వివరాల సేకరణ
- పౌరులు వెల్లడించిన కుల వివరాలే యాప్‌లో నమోదు

03

## ఆంక్షలు విధించడానికి మీరెవరు?

### విద్యార్థులకు నిరసన తెలిపే హక్కు ఉంది: సీజేఐ

బీసీఐకి నోటీసులు జారీ చేసిన సుప్రీంకోర్టు



- బీసీఐ ఆదేశాలపై అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం
- విద్యార్థులకు నిరసన తెలిపే హక్కు ఉంది
- విద్యార్థుల నిరసనతో బీసీఐకి సంబంధమేంటి?
- 2026 బ్యాచ్ ఎన్‌రోల్‌మెంట్‌పై బీసీఐ సంచలన నిర్ణయం
- కొద్ది గంటల్లోనే ఆదేశాలను వెనక్కి తీసుకున్న బీసీఐ

02

## స్మార్ట్ రేషన్ కార్డులపై పొలిటికల్ వివాదం..




03



### రూ.200 కోట్లతో ప్రత్యేక పథకం..

18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలకు ఎలక్ట్రిక్ మార్పు

7 రకాల సన్న ధాన్యాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్

మరో 7 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లకు ఆమోదం

కొడంగల్ ఎత్తిపోతల ఫేజ్-2కు రూ.2,100 కోట్లు

హెచ్‌ఐఎల్‌టీ పాలసీ దరఖాస్తుల గడువు అక్టోబర్ 31 వరకు పొడిగింపు

నేడు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి కేబినెట్ నిర్ణయం

# 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో సరికొత్తగా...

- రాష్ట్రంలో నేడు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు
- హైదరాబాద్‌ను 'గ్రీన్ సిటీ'గా మార్చేందుకు కీలక నిర్ణయం
- 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలకు ఎలక్ట్రిక్ మార్పు
- ఆటో డ్రైవర్లకు గరిష్ఠంగా రూ.1.50 లక్షల సబ్సిడీ
- ఈవీ కన్వర్షన్ స్కీమ్‌కు రూ.200 కోట్ల కేటాయింపు
- డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ సమ్మిట్ 2.0
- 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో గ్లోబల్ సమ్మిట్
- ఫ్యూచర్ సిటీ ప్లాన్‌ను ఆవిష్కరించనున్న ప్రభుత్వం
- ఏడు రకాల సన్న ధాన్యాలకు క్వింటాలుకు రూ.500 బోనస్
- రైతులకు అవగాహన కల్పించాలని కేబినెట్ నిర్ణయం

02

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**


రాష్ట్రంలో నేడు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని తెలంగాణ మంత్రివర్గం నిర్ణయించింది. అందుకు సంబంధించి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. ఇవాళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంది. అలాగే హైదరాబాద్ మహానగరంలో కాలుష్యాన్ని అరికట్టి 'గ్రీన్ సిటీ'గా మార్చేందుకు కేబినెట్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలో ప్రస్తుతం ఉన్న 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోరిక్షాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు రూ.200 కోట్లతో "తెలంగాణ ఆటో రిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్" అమలు...

## నాణ్యమైన విద్యతో సమాజంలో మార్పు

**ఈ ఏడాది ఫీజుల కోసం ఇప్పటికే రూ.250 కోట్లు జమ**

- పేద విద్యార్థుల చదువుకు ఫీజుల భారం ఉండకూడదు
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో విప్లవాత్మక మార్పులు
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అడ్వాన్స్‌గా ఫీజు రీయింబర్స్‌మెంట్
- విద్యార్థుల ఖాతాల్లో నేరుగా నగదు జమ
- ఈ ఏడాది ఫీజుల కోసం ఇప్పటికే రూ.250 కోట్లు జమ
- దరఖాస్తు చేసుకున్న నెలలోపే ఫీజు రీయింబర్స్‌మెంట్
- ఫీజు చెల్లించలేదని సర్టిఫికెట్లు ఆపే పరిస్థితి ఉండదు

02



### విద్యార్థులు చదువుతో పాటు స్కిల్స్ పెంచుకోవాలి



## పార్టీ గీత దాటితే చర్యలు తప్పవు..



- క్రమశిక్షణా కమిటీకి వ్యవహారం పంపే యోచన
- అందరి కోరికలు ఒకేరోజు తీర్చడం సాధ్యం కాదు
- మా సహనాన్ని చేతకానితనంగా భావించొద్దు: రాజగోపాల్ రెడ్డి
- వ్యవహారాన్ని ఏఐసీసీ ఇన్‌చార్జ్ దృష్టికి తీసుకెళ్తాం: మహేశ్ గౌడ్

03



## జీఆర్ఎంబీ కార్యాలయం ముట్టడిస్తాం..

### కాళేశ్వరం లేకుంటే ఆ నీళ్లు ఎక్కడివి?

ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ నీటిని ఎందుకు ఎత్తిపోస్తున్నారు?

సాగునీటి రంగాన్ని కాంగ్రెస్ నిర్లక్ష్యం చేస్తోంది

- ఎల్లంపల్లి, మిడ్‌మానేరు కాళేశ్వరం వ్యవస్థలో భాగమే
- కాళేశ్వరంతో ఎస్సారెస్పీ, నిజాంసాగర్ ఆయకట్టు స్థిరీకరణ
- మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణతో సాగుకు ఊతం
- 24 గంటల విద్యుత్‌తో రికార్డు స్థాయిలో పంటల సాగు
- వ్యవసాయం, సాగునీటి రంగాలపై కాంగ్రెస్ నిర్లక్ష్యం

03

కాళేశ్వరం ప్రాజెక్టు, తెలంగాణ సాగునీటి రంగంపై సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అర్ధసత్యాలు, అబద్ధాలు, కట్టుకథలతో కాళేశ్వరం ప్రాధాన్యతను గానీ, చరిత్రను గానీ మార్చలేరని స్పష్టం చేశారు. వాస్తవాలు వెలుగులోకి రాకుండా ఎవరూ అడ్డుకోలేరంటూ సోషల్ మీడియా వేదికగా ఘాటు వ్యాఖ్యలు చేశారు.






# ఏసీబీ కస్టడీలో డీఎస్పీ భీమ్‌రెడ్డి..

## రూ.200 కోట్ల అక్రమాస్తులపై విచారణ..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో చిక్కుకున్న డీఎస్పీ భీమ్‌రెడ్డిని ఏసీబీ అధికారులు తమ కస్టడీలోకి తీసుకుని విచారణను ముమ్మరం చేశారు. న్యాయస్థానం రెండు రోజుల పాటు ఏసీబీ కస్టడీకి అనుమతించడంతో, అధికారులు చంచల్ గూడ జైలు నుంచి నాంపల్లిలోని ఏసీబీ కార్యాలయానికి గురువారం తరలించారు. ఈ సందర్భంగా భీమ్‌రెడ్డి సంపాదించిన భారీ అక్రమాస్తులు, బినామీ వ్యవహారాలపై అధికారులు విచారణ జరుపుతున్నారు. ఇప్పటి వరకు జరిగిన సోదాల్లో భీమ్‌రెడ్డి సుమారు రూ.200 కోట్ల పైగా విలువైన ఆస్తులను కూడబెట్టినట్లు ఏసీబీ ప్రాథమికంగా గుర్తించింది. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా, కర్ణాటకలోనూ ఆయన భారీగా భూములు కొనుగోలు చేసినట్లు తేలింది. ముఖ్యంగా బెంగళూరు ఎయిర్‌పోర్టు సమీపంలోని విలువైన భూములతో పాటు జహీరాబాద్, వికారాబాద్ ప్రాంతాల్లో సుమారు 40 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు సమాచారం.ఈ ఆస్తుల కొనుగోలుకు సంబంధించిన నిధుల సేకరణపై అధికారులు ఆరా తీస్తున్నారు. భీమ్‌రెడ్డి వద్ద హోంగార్డుగా పనిచేస్తున్న లక్ష్మణ్ పేరుతో భారీగా బినామీ ఆస్తులను కూడబెట్టినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. దీనికి సంబంధించి కీలక ఆధారాలను సేకరించిన ఏసీబీ, ఆ దిశగా విచారణను వేగవంతం చేసింది. ఇప్పటికే నిందితుడికి సంబంధించిన 10 బ్యాంక్ ఖాతాలను, రెండు బ్యాంక్ లాకర్లను అధికారులు సీజ్ చేశారు. ఈ లాకర్లలో భారీగా బంగారం, నగదు ఉండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. రెండు రోజుల విచారణలో మరిన్ని బినామీ ఆస్తుల వివరాలు, అక్రమ సంపాదనలో భాగసా-్వములైన ఇతరుల వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



# సైబర్ క్రిమినల్స్ టార్గెట్ వీరే..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సైబర్ నేరాల బాధితుల్లో రిటైర్డ్ ఉద్యోగులే ఎక్కువ ఉన్నారని తెలంగాణ డీజీపీ సీవీ ఆనందన్ చెప్పారు. అందుకే సురక్ష కా తిరంగలో రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లను భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. 40 రకాల సైబర్ నేరాలను గుర్తించామన్నారు. ఇవాళ హైదరాబాద్ పోలీస్ కమాండ్ కంట్రోల్ లో సురక్ష కా తిరంగా సైబర్ అవగాహన కార్యక్రమంలో మాట్లాడిన డీజీపీ.. ప్రజలు కూడా మోసపూరిత, అపరిచిత వ్యక్తులు పంపిన లింకులు క్లిక్ చేయవద్దని సూచించారు. ఇన్వెస్ట్ మెంట్ చేస్తే ఎక్కువ డబ్బులు వస్తాయని ఆశ చూపుతున్నారంటే అనుమానించాలని డబ్బుల విషయంలో అత్యాశకు పోవద్దని సూచించారు. ఎక్కువ డబ్బులు ఇస్తామంటున్నారంటే అందులో మోసం ఉందని గ్రహించాలని హెచ్చరించారు.

**సినిమా ఇండస్ట్రీకి రూ.22 వేల కోట్ల నష్టం:**
డిజిటల్ అరెస్టు విషయంలో పోలీసులు పెద్ద ఎత్తున ప్రచారం చేయడంతో ప్రజలు ప్రస్తుతం అప్రమత్తం అవుతున్నారని చెప్పారు. డ్రగ్స్ బారిన పడి విద్యార్థులు, యువత జీవితాలు నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. నిందితులు ఎక్కడో పట్నాలో కూర్చుని సర్వర్లు హ్యాక్ చేస్తున్నారు. నిందితులు కొన్నేళ్లుగా సినిమా పైరసీకి పాల్పడుతున్నారు. 2022 నుంచి ఇప్పటి వరకు సినిమా పరిశ్రమకు దాదాపు రూ.22 వేల కోట్ల నష్టం కలిగించారన్నారు.

# ఆంక్షలు విధించడానికి మీరెవరు?

**న్యూఢిల్లీ:** హైదరాబాద్‌లోని నాల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం 2026 బ్యాచ్ గ్రాడ్యుయేట్లను అడ్వకేట్లుగా ఎన్‌రోల్ చేయవద్దంటూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జారీ చేసి, ఆ తర్వాత ఉపసంహరించుకున్న ఆదేశాలపై భారత అత్యున్నత న్యాయస్థానం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. నిరసన తెలపడం విద్యార్థుల రాజ్యాంగబద్ధమైన హక్కని, ఈ వ్యవహారంతో బీసీఐకి అసలు సంబంధమే లేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. సీజేఐతో పాటు జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ అంశంపై కీలక వ్యాఖ్యలు చేసింది. "విద్యార్థులకు నిరసన తెలిపే హక్కు ఉంది.. ఇది విద్యార్థులకు, సీజేఐకి మధ్య జరిగిన ఒక సంభాషణ (డైలాగ్) మాత్రమే. ఇందులో బీసీఐ చేయడానికేమీ లేదు" అని సీజేఐ జస్టిస్ సూర్య కాంత్ మౌఖికంగా పేర్కొన్నారు.ఈ వివాదం వెనుక ఉన్న వివరాల్లోకి వెళ్తే.. నాల్సార్ స్నాతకోత్సవంలో సీజేఐ సూర్య కాంత్ పాల్గొనడాన్ని వ్యతిరేకిస్తూ కొందరు విద్యార్థులు ప్రచారం (క్యాంపెయిన్) నిర్వహించారనే ఆరోపణల నేపథ్యంలో బీసీఐ ఆగస్టు 13న అనూహ్య నిర్ణయం తీసుకుంది. 2026 బ్యాచ్ నాల్సార్ విద్యార్థులను అడ్వకేట్లుగా ఎన్‌రోల్ చేసుకోవద్దంటూ అన్ని రాష్ట్రాల బార్ కౌన్సిళ్లకు ఆదేశాలు జారీ చేసింది. బీసీఐ ఛైర్మన్ మనన్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ.. సీజేఐకి వ్యతిరేకంగా జరిగిన ప్రచారానికి బాధ్యులైన వారిపై నివేదిక కోరామని, దీనిపై పరిశీలన జరిపి ఆగస్టు 19న తుది నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. అయితే, బీసీఐ తీసుకున్న ఈ నిర్ణయంపై సోషల్ మీడియాలో తీవ్ర స్థాయిలో నిరసనలు, ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవ్వడంతో బీసీఐ కేవలం కొద్ది గంటల వ్యవధిలోనే తన ఆదేశాలను వెనక్కి తగ్గించుకుంది. అత్యధిక శాతం విద్యార్థులు నిర్దోషులని, కొందరి ప్రవర్తన వల్ల మిగతా వారి భవిష్యత్తు దెబ్బతినకూడదని చెబుతూ విద్యార్థులందరి ఎన్‌రోల్‌మెంట్‌కు అనుమతినిస్తూ సవరించిన ఉత్తర్వులు విడుదల చేసింది.అయితే, బీసీఐ మొదట జారీ చేసిన సంచలన సర్క్యులర్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ అత్యవసర విచారణకు రావడంతో సుప్రీంకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంలో బీసీఐ వైఖరిని తప్పుపట్టిన ధర్మాసనం, బీసీఐకి నోటీసులు జారీ చేసి వివరణ కోరింది. అదే సమయంలో నాల్సార్ విద్యార్థులపై గానీ, అక్కడి ఫ్యాకల్టీపై గానీ బీసీఐ లేదా ఏ రాష్ట్ర బార్ కౌన్సిల్ కూడా ఎలాంటి శిక్షాత్మక (పునిటివ్) చర్యలు తీసుకోకూడదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. విచారణ సందర్భంగా బీసీఐ తరఫు న్యాయవాది స్పందిస్తూ, వివాదాస్పద సర్క్యులర్‌ను ఇప్పటికే ఉపసంహరించుకున్నామని ధర్మాసనానికి వెల్లడించారు. దీంతో ఈ కేసు తదుపరి విచారణను సుప్రీంకోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది.

# 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో సరికొత్తగా...

## 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0' నిర్వహణకు ఆమోదం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో నేడు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని తెలంగాణ మంత్రివర్గం నిర్ణయించింది. అందుకు సంబంధించి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. ఇవాళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంది. అలాగే హైదరాబాద్ మహానగరంలో కాలుష్యాన్ని అరికట్టి 'గ్రీన్ సిటీ'గా మార్చేందుకు కేబినెట్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలో ప్రస్తుతం ఉన్న 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోరిక్షాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు రూ.200 కోట్లతో "తెలంగాణ ఆటో రిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్" అమలుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.1,50,000 సబ్సిడీ అందిచనున్నారు. ఆటో డ్రైవర్లు తమ పాత ఆటోకు ఈవి కిట్ అమర్చుకోవడానికి లేదా పాత వాహనాన్ని స్క్రాప్ చేసి కొత్త ఈ-ఆటో కొనుగోలు చేయడానికి ఈ సబ్సిడీ వర్తిపచేయనున్నారు.

**డిసెంబర్ లో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0':**
గత ఏడాది తరహాలోనే ఈ ఏడాది కూడా 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0' నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఈ సదస్సును నిర్వహించేందుకు ప్రాథమికంగా నిర్ణయించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామిల ఆధ్వర్యంలో సబ్ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో జరిగే ఈ సదస్సులో 'ఫ్యూచర్ సిటీ ప్లాన్' ను ప్రభుత్వం ఆవిష్కరించనుంది. డిఫెన్స్, ఏరోస్పేస్, ఫార్మా రంగాల్లో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా స్టార్టప్స్, కొత్త ఆవిష్క-రణలతో భారీ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నారు.

**7 రకాల సన్నాలకు రూ.500 బోనస్!**
వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించేందుకు రైతులకు రైతు వేదికలు, గ్రామ పంచాయతీల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ ఏడాది నుంచి ఈ 7 రకాల సన్నాలకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించనున్నారు. యాసంగి ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. రికార్డు స్థాయిలో 81.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా, కేంద్రం కేవలం 63.62 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే తీసుకుంటుంది. మిగిలిన 17.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఈ వేలం ద్వారా విక్రయించేందుకు కేబినేట్ ఆమోదం తెలిపింది. ఇటీవల మొక్కజొన్న వేలంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం రాబట్టుకున్న నేపథ్యంలో ఈ మిగులు ధాన్యానికి కూడా క్వింటాలుకు రూ.2389 బేసిక్ ప్రైస్ నిర్ణయించి.. ఈ వేలం ద్వారా ధాన్యం అమ్మాలని కేబినేట్ నిర్ణయించింది.

**విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు:**
రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలు సాంకేతిక విద్యా శాఖ పరిధిలో ఉన్నాయి. వీటిని తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ నుంచి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలో చేర్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం పరిశ్రమల శాఖ పరిధిలో ఉన్న వీటన్నింటినీ ఇకపై శక్తి శాఖ పరిధిలోకి విలీనం చేసేందుకు క్యాబినెట్ తీర్మానించింది. మరో 7 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పా-ఠశాలలు: ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో కొత్తగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. దీంతో ఇప్పటివరకు మంజూరైన స్కూళ్ల సంఖ్య 86కి చేరింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించాలని సీఎం ఆదేశించారు.

**కొడంగల్ ఎత్తిపోతలకు రూ. 2,100 కోట్లు:**
మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపో-తల ప్రాజెక్టు ఫేజ్-2 పనుల కోసం రూ.2,100 కోట్ల అంచనా వ్యయానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. దీని ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందుతుంది. అలాగే గూడెం దొడ్డి ఎత్తిపో-తల ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.19 టీఎంసీల నుంచి 15 టీఎంసీలకు పెంచడంతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై అధ్యయనానికి కన్సల్టెంట్‌ను నియమించనున్నారు.

**హెచ్ఐఎల్‌టీ పాలసీ గడువు పెంపు:**
హైదరాబాద్ నగరంలోని కాలుష్య కారక పరిశ్రమలను శివార్లకు తరలించే హెచ్ఐఎల్‌టీపాలసీ దరఖాస్తుల గడువును దరఖాస్తుదారుల విజ్ఞప్తి మేరకు అక్టోబర్ 31 వరకు (మరో 3 నెలలు) పొడిగిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

# నాణ్యమైన విద్యతో సమాజంలో మార్పు



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలోని పేద విద్యార్థుల చదువుకు ఫీజుల భారం అడ్డుకాకూడదనే లక్ష్యంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలులో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి అడ్వాన్స్ గా విద్యార్థుల ఖాతాలో ఫీజు రీయింబర్స్ మెంట్ డబ్బులు జమ చేయ-ఁబోతున్నామని చెప్పారు. ఈ ఏడాదికి సంబంధించిన ఫీజు రీయింబర్స్ మెంట్ కోసం ఇప్పటికే రూ.250 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమచేశామని భవిష్యత్‌లో కళాశాలల్లో ప్రవేశాలు పొందాక ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న నెలలోపు ఫీజు రీయింబర్స్ మెంట్ డబ్బులు విద్యార్థుల ఖాతాలో జమ చేస్తామన్నారు. ఇవాళ ట్యాంక్ బండ్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించిన సీఎం అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. పారదర్శకంగా ఫీజు రీయింబర్స్ మెంట్ పథకం అమలు చేయాలని మా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఫీజు కట్టలేదని సర్టిఫికెట్ ఇవ్వమని కాలేజీ యాజమాన్యాలు చెప్పే పరిస్థితి ఇకపై రాబోదన్నారు.

**సామాజిక న్యాయానికి అనేక కుట్రలు:**
ఈ దేశంలో పశువులకు లెక్క ఉంది కానీ బీసీల లెక్కలు లేవని అందుకే ఎన్ని అడ్డంకులు వచ్చినా బీసీ జనగణన చేపట్టామని ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఎస్సీ కులగణన చేపట్టామని సీఎం చెప్పారు. కుటుంబ సమగ్ర సర్వేలో పాల్గొనని వారు బీసీ లెక్కలను అడ్డుకునేందుకు అనేక ప్రయత్నాలు చేశారని విమర్శించారు. గత ప్రభుత్వంలో గొర్రెలు, బర్రెలు పెంచుకోవాలని చెబితే మేము డాక్టర్లు, లాయర్లు ఐఏఎస్, ఐపీఎస్ లు, ప్రజాప్రతినిధులు కావాలని అంటున్నామన్నారు. నాకు వయసు ఓపికతో పాటు మంచి సలహాదారులు, సహచరులు ఉన్నారని ఇంత మంచి అవకాశం, మీరు కోరుకుంటున్న ఇలాంటి ప్రభుత్వం మళ్లీ రాదన్నారు. ఈ ప్రభుత్వానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

**కుల నిర్మూలకే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్స్:**
ట్యాంక్ బండ్ కు వస్తే గొప్ప వ్యక్తుల విగ్రహాలు కనిపిస్తాయని ఇవి కేవలం విగ్రహాలే కాదని వారు చేసిన త్యాగాలు. వాళ్ల గొప్పతనాలు భావితరాలకు తెలియాలనే విగ్రహాల ఏర్పాటు అన్నారు. 150 ఏండ్ల క్రితం చదువుకు ఉన్న ప్రాధాన్యతను పూలే దంపతులు చాటి చెప్పారని అన్నారు. సమాజంలో కుల నిర్మాలన తీసుకువచ్చేందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కు శ్రీకారం చుట్టామన్నారు. నాణ్యమైన విద్యను ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలో అందించే ప్రయత్నం చేస్తున్నాంమన్నారు. సాంకేతిక నైపుణ్యం ఉన్న వారికే ప్రపంచం రెడ్ కార్పెట్ తో స్వాగతిస్తోందని. భాషా నైపుణ్యం ఉన్న నర్సులకు జర్మనీ, జపాన్, దక్షిణ కోరియాలో ఉద్యోగాలు ఉన్నాయన్నారు. ఐటీ నిపుణులు కూడా ఉద్యోగాలు పోయి వెనక్కి వచ్చే పరిస్థితి ఏర్పడిందని, ఏఐ వల్ల ఐటీ నిపుణుల ఉద్యోగాలు పోయే పరిస్థితి సంక్షోభాన్ని ఎలా ఎదుర్కోవాలో అందరూ ఆలోచించాలన్నారు. అదువల్ల చదువుల్లో నాణ్యత ఉండాలని.. స్కిల్స్ పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఐటీఐలను ఏటీసీలుగా అభివృద్ధి చేశామన్నారు. ఒలింపిక్స్ లో మెడల్స్ సాధిస్తే ప్రభుత్వ ఉద్యోగం, నజరానాలు ఇస్తామన్నారు.

# దేశమా నీకు ఇదే వందనం



దేశమా నీకు ఇదే వందనం
స్వాతంత్ర మా నీకు ఘన స్వాగతం
ఈ దేశం నాది ఈ రాజ్యం నాది అని
ప్రతి పౌరుడుకి ఉండాలి
ప్రతి పౌరుడు సైనికుల పోరాడాలి!!!

మూడు రంగుల జెండా
మురిసిపోవాలి
భారతీయులంతా కలసి రావాలి
స్వాతంత్ర దినోత్సవ సంబరాలలో
మన దేశ ఖ్యాతి దిగంతాలు దాటాలే!!!

నాటి నేతల స్ఫూర్తిని పునికి
పుచ్చుకోవాలి
అభివృద్ధి బాటలో అడుగులు వేయాలి
భారతావని గుండెల్లో వెలుగులు
నింపాలి
విజ్ఞాన గనిగా నింగిన అంటారు
నా భారతదేశం!!!

రచన :-
దేవులపల్లి రమేశ్,
కలం : వామిక శ్రీ వర్ష,
నంగునూర్, సిద్దిపేట జిల్లా
చరవాణి :-9963701294.

# మోడీ పిలుపుతో దేశమంతా హర్ ఘర్ తిరంగా



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రధాని నరేంద్రమోడీ పిలుపుతో దేశమంతా హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహిస్తున్నట్లు కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం నుంచి వివేకానంద విగ్రహం వరకూ నిర్వహించిన ర్యాలీలో బండి సంజయ్ పాల్గొన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, సైనా నెహ్వాల్, దీపికా రెడ్డి, నటీనటులు సాయికుమార్, సంతోష్, ఫరియా అబ్దుల్లా తదితరులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. నేటి యువతకు స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమరయోధుల గురించి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. మేకిన్ ఇండియా, స్టార్టప్ ఇండియా ద్వారా యువతకు ఎన్డీఏ సర్కార్ మంచి అవకాశాలను కల్పిస్తోందన్నారు. రైల్వేలు, హైవేలు విమానయాన రంగాల్లో ఇప్పటి వరకూ ఎంతో అభివృద్ధి జరిగిందని వివరించారు. దేశం - జాతీయ జెండా - రాజ్యాంగం అంతా ఒకటేనని చెప్తూ.. ఐక్యతా సందేశాన్నిచ్చారు. జాతీయ జెండాను కాంగ్రెస్ కాపీ కొట్టి.. అభివృద్ధి జరగకుండా అడ్డుకుందని విమర్శించారు. దేశ అభివృద్ధి అంటే ఏంటో చూపించిన మహనీయుడు నరేంద్రమోడీ అని కొనియాడారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా
మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# జీఆర్ఎంబీ కార్యాలయం ముట్టడిస్తాం..

## రేవంత్ రెడ్డికి హరీశ్ రావు స్ట్రాంగ్ కౌంటర్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాళేశ్వరం ప్రాజెక్టు, తెలంగాణ సాగునీటి రంగంపై సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అర్ధసత్యాలు, అబద్ధాలు, కట్టుకథలతో కాళేశ్వరం ప్రాధాన్యతను గానీ, చరిత్రను గానీ మార్చలేరని స్పష్టం చేశారు. వాస్తవాలు వెలుగులోకి రాకుండా ఎవరూ అడ్డుకోలేరంటూ సోషల్ మీడియా వేదికగా ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**కాళేశ్వరం లేకుంటే ఆ నీళ్లు ఎక్కడివి?**

కాళేశ్వరం ప్రాజెక్టు లేకుండానే రాష్ట్రంలో రికార్డు స్థాయిలో పంటలు పండాయని సీఎం రేవంత్ రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. కాళేశ్వరం లేకపోతే మరి గోదావరి జలాలను ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా గట్టిగా ఎత్తిపోసేలా అధికారులను ఎందుకు ఆదేశిస్తున్నారని సూటిగా ప్రశ్నించారు. ఎల్లంపల్లి, మిడ్‌మానేరు ప్రాజెక్టులు కాళేశ్వరం వ్యవస్థలో అంతర్భాగమనే వాస్తవాన్ని ఎంత దాచాలని చూసినా సాధ్యం కాదని అన్నారు. కేసీఆర్ హయాంలో ఎల్లంపల్లి, దేవాదుల, మిడ్‌మానేరు వంటి ప్రాజెక్టులను పూర్తి చేయడం, మిషన్ కాకతీయ ద్వారా చెరువులను పునరుద్ధరించడం, భూగర్భ జలాలను పెంచడం, రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించడం వల్లే రాష్ట్రంలో రికార్డు స్థాయిలో పంటలు పండాయని గుర్తుచేశారు. కాళేశ్వరం ద్వారానే ఎస్సారెస్పీ (SRSP), నిజాంసాగర్ ఆయకట్టు స్థిరీకరణకు బాటలు పడ్డాయన్నది పచ్చి నిజమని పేర్కొన్నారు.

**వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తుండ్రు..**

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయం, సాగునీటి రంగాలపై చూపుతున్న నిర్లక్ష్యం యావత్ తెలంగాణకు శాపంగా మారిందని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలన వల్ల రాష్ట్రంలో గోదావరి, కృష్ణా జలాల కోసం మళ్లీ ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితులు వస్తున్నాయని మండిపడ్డారు. అబద్ధపు ప్రచారాలు, వ్యాసాలు, రీట్వీట్లతో రైతులను మభ్యపెట్టడం తక్షణమే ఆపాలని హితవు పలికారు.

**ఈనెల 18న జీఆర్ఎంబీ కార్యాలయం ముట్టడిస్తాం..**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన తెలంగాణ వ్యతిరేక అంశాలను గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) ఎజెండా నుంచి తక్షణమే తొలగించేలా చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ అంశాలను తొలగించకుండా ఈనెల 18న జరిగే జీఆర్ఎంబీ సమావేశానికి హాజరైతే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. తెలంగాణ నీటి హక్కులను కాపాడుకునేందుకు వేలాది మంది రైతులతో, శ్రేణులతో కలిసి జీఆర్ఎంబీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హరీశ్ రావు హెచ్చరించారు.



# హిందువుల పైకి హైడ్రా... పాతబస్తీకి ఉచిత కరెంటా?

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఓల్డ్ సిటీలో మైనారిటీలు కరెంట్ బిల్లులు కట్టరనే ఆరోపణలు ఉన్నాయని, తమ ప్రభుత్వం వచ్చాక అమలు చేస్తున్న 200 యూనిట్ల పథకం వల్ల ఎక్కువగా మైనారిటీలకే లబ్ధి చెందుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు మండిపడ్డారు. ఎక్స్ వేదికగా ఇవాళ పోస్టు చేసిన ఆయన.. 'పాతబస్తీలోని మైనారిటీలు విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదని, అందుకే వారికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామని తెలంగాణ సీఎం అన్నారు. ఇదే మీ ప్రభుత్వ విధానం అయితే.. నిబంధనలు పాటించలేదనే కారణంతో హైడ్రా చర్యలు తీసుకుంటున్నప్పుడు పేద కుటుంబాల విషయంలో ఇదే సానుభూతిని ఎందుకు చూపడం లేదు?' అని ప్రశ్నించారు.

**హిందుకుటుంబాలపై సానుభూతి ఏది?:**

ఒకవైపు సీఎం పేద హిందూ కుటుంబాలపై నిబంధనల ఉల్లంఘన పేరుతో హైడ్రాను ప్రయోగిస్తూ మరోవైపు మైనారిటీల సంక్షేమం పేరుతో విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడాన్ని సమర్థించే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. హిందూకుటుంబాలపై ఆ సానుభూతి ఏదని నిలదీశారు. హిందువుల ప్రయోజనాలను పణంగా పెట్టి మైనారిటీలను బుజ్జగించే రాజకీయాల చేయడంలో ఖిలాఫత్ ఉద్యమం నుంచి ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీలో మారలేదని దుయ్యబట్టారు.

# కేంద్రం కీలక నిర్ణయం..

**న్యూ ఢిల్లీ :** దేశవ్యాప్తంగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'జనగణన 2027 ప్రక్రియలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. సమగ్ర కుల గణనతో కూడిన రెండో విడత జనాభా లెక్కల సేకరణకు సంబంధించిన 40 ప్రశ్నల జాబితాను హోం మంత్రిత్వ శాఖ అధికారికంగా నోటిఫై చేసింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో ఎస్సీ,ఎస్టీ వర్గాలతో పాటు ఇతర అన్ని వర్గాల సమగ్రకుల వివరాలను సేకరించడం ఇదే తొలిసారి కావడం విశేషం.

**10వ ప్రశ్నగా 'కులం'..**

కేంద్రం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. సెన్సస్ ఫారమ్‌లోని 10వ ప్రశ్నగా కులం అని కేటాయించారు. ఇది ఓపెన్ కాలమ్ " రూపంలో ఉంటుంది. పౌరులు తమ కులానికి సంబంధించి వెల్లడించే వివరాలను ఎన్యూమరేటర్లు యథాతథంగా యాప్‌లో నమోదు చేస్తారు. మొత్తం రూ.11,718.24 కోట్ల అంచనా వ్యయంతో రెండు దశల్లో ఈ మహత్తర ప్రక్రియను పూర్తి చేయడానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. కాగిత రహితంగా, మొబైల్ యాప్‌లు, అధునాతన డిజిటల్ సాధనాల ద్వారా డేటాను సేకరిస్తారు. పౌరులు స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునే 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' వెసులుబాటు కూడా ఉంటుంది. మొదటి దశ ఏప్రిల్ 2026 నుండి సెప్టెంబర్ 2026 వరకు జరగనుంది.

**వ్యక్తిగత వివరాలతో పాటు ఆధార్, బ్యాంక్ ఖాతాలు..**

40 ప్రశ్నల ప్రశ్నావళిలో పౌరుల పేరు, వయస్సు, వైవాహిక స్థితి, మతం, మాతృభాష, విద్యా అర్హతలు, డిజిటల్ అక్షరాస్యత, ఉద్యోగం/ఉపాధి, వలస వివరాలతో పాటు.. కొత్తగా కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకున్న ప్రదేశం, బ్యాంక్ ఖాతాల సంఖ్య, ఆధార్, ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్ వివరాలను సేకరించనున్నారు. ఈ సాంకేతిక విప్లవాత్మక జనాభా గణన ద్వారా లభించే కచ్చితమైన డేటా.. భవిష్యత్తులో సంక్షేమ పథకాల అమలుకు, సుపరిపాలనకు ఎంతో దోహదపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

# పార్టీ గీత దాటితే చర్యలు తప్పవు..

## రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ గరం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాంగ్రెస్ పార్టీతో ఏమాత్రం సంబంధం లేని వారు, ఆంధ్ర నాయకుల మోచేతి నీళ్లు తాగే వారు ఇవాళ ప్రభుత్వంలో కీలక పదవులు అనుభవిస్తుండటం సహించరాని విషయం అంటూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అధికార పార్టీలో నిప్పు రాజేశాయి. ఈ నేపథ్యంలోనే రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై తాజాగా టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం, పార్టీ అధిష్టానంపై ఆయన పరోక్షంగా చేసిన వ్యాఖ్యలు తన దృష్టికి వచ్చాయని తెలిపారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటి నేతనైనా సహించేది లేదని వార్నింగ్ ఇచ్చారు. పార్టీ గీత దాటితే ముఖ్యమంత్రితో సహా ఎవరైనా సరే అందరూ ఒకటేనని అన్నారు. క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడితే ఖచ్చితంగా చర్యలుంటాయని పేర్కొన్నారు. రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, తీసుకోవాల్సిన చర్యలపై కాంగ్రెస్ హైకమాండ్‌తో చర్చిస్తాని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

**అందరి కోరికలు తీర్చడం సాధ్యం కాదు..**

ఎన్నికల సమయంలో మునుగోడులో ప్రచారం సందర్భంగా రాజగోపాల్ రెడ్డికి పార్టీ అధిష్టానం కొన్ని హామీలు ఇచ్చి ఉండవచ్చని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. అయినప్పటికీ, పార్టీకి వ్యతిరేకంగా బహిరంగంగా మాట్లాడటానికి ఎవరికీ హక్కు లేదని అన్నారు. పదవులు, మంత్రివర్గ విస్తరణపై పార్టీ హైకమాండ్‌దే తుది నిర్ణయమని.. ఒకేరోజు అందరి కోరికలు తీర్చడం ఎంతటి వారికైనా సాధ్యం కాదిని కుండబద్దలు కొట్టారు. అయితే, మంత్రివర్గంలో స్థానం లభించలేదన్న అసంతృప్తితో పాటు నియోజకవర్గానికి నిధుల కేటాయింపుపై రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకత్వం తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారాన్ని పార్టీ క్రమశిక్షణా కమిటీకి పంపే యోచనలో ఉన్నట్లుగా తెలుస్తోంది

**కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఏమన్నారంటే..!**

కాగా, హైదరాబాద్ రవీంద్రభారతిలో కళాకారుడు ఏపూరి సోమన్న 25 ఏళ్ల పాటల ప్రస్థానంపై రూపొందించిన పుస్తకావిష్కరణ సభలో పాల్గొన్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సొంత ప్రభుత్వం వ్యతిరేకంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని దోపిడీకి పాల్పడుతున్న వారికి వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధం కావాలని, అందుకే ఏపూరి లాంటి కళాకారులు గజ్జ కట్టాలని అన్నారు. ఏపూరి సోమన్న పాడిన.. ఎవరి పాలైందిరో తెలంగాణ పాటలోని పరిస్థితులే నేడు రాష్ట్రంలో కొనసాగడం బాధకరమని రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని అభివృద్ధి పేరుతో లక్షల కోట్లు దోచుకుంటున్నారని.. అలాంటి దోపిడీదారుల వెంట పడతామని, వారి దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. మా సహనాన్ని, ఓపికను చేతకాని తనంగా భావించవద్దని, ఇన్నాళ్లు సహనంగా ఉన్నామని, ఇక పోరాటానికి సమయం వచ్చిందని వ్యాఖ్యానించారు. స్వరాష్ట్రంలో తెలంగాణ ఉద్యమకారులకు, పేదలకు న్యాయం దక్కడం లేదని, అభివృద్ధి పేరిట తెచ్చిన రూ.లక్షల కోట్ల అప్పులు చేసిన నిధులు ఆంధ్ర కాంట్రాక్టర్లే దక్కుతున్నాయని విమర్శించారు. అధికారంలో ఉన్న వారు రూ.లక్షల కోట్లు దోచుకుంటుంటే పేదోడికి రూ.5 లక్షల ఇందిరమ్మ ఇంటి బిల్లుకు 500 కొర్రీలు పెడుతున్నారని తప్పుబట్టారు. హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. అదేవిధంగా తాను గెలిపించిన ఓ ఎమ్మెల్యే కులం కార్డును అడ్డుపెట్టుకొని అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఇండైరెక్ట్‌గా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ తీరుపై రాజగోపాల్ రెడ్డి మండిపడ్డారు.

# స్మార్ట్ రేషన్ కార్డులపై పొలిటికల్ వివాదం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా అత్యాధునిక 'స్మార్ట్ రేషన్ కార్డుల' పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఆగస్టు 15న సంగారెడ్డి జిల్లా వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇదే సమయంలో రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాల్లోనూ మంత్రులు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ జరగనుంది. ఈ మేరకు పంపిణీ చేయబోతున్న స్మార్ట్ రేషన్ కార్డు మోడల్ ను ప్రభుత్వం విడుదల చేసింది. కార్డుకు ఎడమవైపు సీఎం రేవంత్ రెడ్డి, కుడివైపు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోటోలను ముద్రించారు. అయితే, పంపిణీ ప్రారంభానికి ముందే ఈ కార్డుల డిజైన్ రాజకీయ దుమారానికి దారితీసింది. కార్డులపై ప్రధాని నరేంద్ర మోడీ ఫోటో లేకపోవడంపై రాష్ట్ర బీజేపీ నాయకత్వం తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది.

**భగ్గుమన్న బీజేపీ:**

రేషన్ కార్డులపై కేవలం సీఎం, పౌరసరఫరాల శాఖ మంత్రి ఫోటోలు మాత్రమే ముద్రించి, ప్రధాని మోడీ ఫోటో పెట్టకపోవడం పట్ల తెలంగాణ బీజేపీ నేతలుఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ బియ్యం పంపిణీలో కేంద్రానిదే సింహభాగమని అలాంటప్పుడు ఎవని అయ్య జాగీరు అని రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోటోలు మాత్రమే వేసుకుంటున్నారు? అంటూ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఘాటు విమర్శలు చేశారు. ఇక పేదలకు ఉచిత రేషన్ బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వమే అందిస్తుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం తమ ప్రచారం కోసం సీఎం, మంత్రి ఫోటోలు వేసుకోవడం హాస్యాస్పదమని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. భవిష్యత్ లో ఈ ప్రభుత్వం దిగిపోయాక మళ్లీ కొత్త కార్డులు ఇవ్వాల్సి వస్తుందన్నారు.

**సీఎం సభలో గొడవైతే మాకు సంబంధం లేదు:**

ప్రధాని మోడీ ఫోటో లేకుండా స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడాన్ని తక్షణమే నిలిపివేయాలని ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఒక్కో లబ్ధిదారుడికి ఇచ్చే 6 కిలోల బియ్యంలో 5 కిలోలు కేంద్ర ప్రభుత్వమే ఇస్తోంది. అలాంటప్పుడు మోడీ ఫోటో పెట్టకపోవడం కేంద్రాన్ని అవమానించడమే అని మండిపడ్డారు. నిరసనల నడుమ సంగారెడ్డి పంపిణీ సభలో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే దానికి బీజేపీని బాధ్యులను చేయవద్దని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పని తక్కువ.. ప్రచారం ఎక్కువ సెటైర్ వేశారు. తెల్లారితే స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఉండగా మోడీ ఫోటో పై చెలరేగిన పొలిటికల్ వివాదం ఎలాంటి ఉద్రిక్తతలకు దారితీస్తుందోనని రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



# ఆకునూరి మురళి హాట్ కామెంట్స్..


**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో రోజురోజుకూ పెరిగిపోతున్న ప్రైవేట్ పాఠశాలల ఫీజులను అరికట్టేందుకు ప్రభుత్వం తక్షణమే ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని ప్రముఖ సామాజిక వేత్త, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి డిమాండ్ చేశారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు అడ్డగోలుగా ఫీజులు పెంచుతుండటంతో మధ్యతరగతి, దిగువ తరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఓ వీడియో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆకునూరి మురళి మాట్లాడుతూ.. "నాణ్యమైన విద్య లేక పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపలేకపోతున్నాం. మరోవైపు ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులు ఆకాశాన్ని తాకుతుండటంతో సామాన్య కుటుంబాల బడ్జెట్ తలకిందులవుతోంది" అని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లవుతున్నా ప్రజలకు నాణ్యమైన ప్రభుత్వ విద్యను అందించలేకపోవడం, ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టే సరైన చట్టాలు లేకపోవడం బాధాకరమని విమర్శించారు.

**రౌండ్ టేబుల్ సమావేశం..**

ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ చట్టం సాధన కోసం తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ ఆధ్వర్యంలో నేడు ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# జెండా ఎగురవేయడం ఒక్కటే కాదు...

## రాజ్యాంగ విలువులను కాపాడడమే అసలైన స్వాతంత్ర్యం



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మిర్యాలగూడ పట్టణ ప్రజలకు మరియు దేశ ప్రజలకు ప్రముఖ న్యాయవాది ఆర్. భాస్కర్ నాయుడు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పత్రికా ప్రకటన ద్వారా దేశ ప్రజలకు ఒక ప్రత్యేక సందేశాన్ని అందించారు. స్వాతంత్ర్య దినోత్సవం అనగానే కేవలం జాతీయ జెండాను ఆవిష్కరించడం, జాతీయ గీతాన్ని ఆలపించడం, వేడుకల్లో పాల్గొనడం మాత్రమే కాదని, మన దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను మననం చేసుకునే పవిత్ర దినమని ఆయన పేర్కొన్నారు. బ్రిటిష్ పాలన నుంచి 1947 ఆగస్టు 15న విముక్తి పొందిన నాటి నుంచి నేటి వరకు సాగుతున్న దేశ ప్రగతి ప్రయాణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవం ఒక చారిత్రక మైలురాయి అని అన్నారు.

**"స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా ముఖ్యం"**

ఒక న్యాయవాదిగా సమాజానికి తాను ఇస్తున్న ముఖ్యమైన సందేశం ఇదేనని అన్నారు. స్వాతంత్ర్యం అంటే మనకు నచ్చినట్లుగా వ్యవహరించడం మాత్రమే కాదని, తోటివారి హక్కులను గౌరవించడం, చట్టాన్ని తూచా తప్పకుండా పాటించడం, రాజ్యాంగ విలువలను పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు.

**యువతలో దేశభక్తి,సామాజిక స్పృహ అవసరం:**

ప్రస్తుత తరానికి స్వాతంత్ర్య సమర చరిత్రను తెలియజేయడం అత్యంత ఆవశ్యకమని అన్నారు. యువతలో దేశభక్తి,సామాజిక బాధ్యత, రాజ్యాంగంపై గౌరవం పెంపొందించాలని కోరారు. స్వాతంత్ర్య సమరయోధులు కలలుగన్న న్యాయబద్ధమైన, సమానత్వంతో కూడిన,బలమైన భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి కుటుంబం, విద్యాసంస్థ, కార్యాలయం స్వాతంత్ర్య విలువను గుర్తించి, దేశ ఐక్యత, సమగ్రత మరియు శాంతిభద్రతల పరిరక్షణ కోసం పునరంకితం కావాలని ఆయన కోరారు.

"జెండాను ఎగురవేయడం ఒక వేడుక...
స్వాతంత్ర్య విలువలను కాపాడడం ఒక బాధ్యత...
రాజ్యాంగాన్ని గౌరవించడం ప్రతి పౌరుడి కర్తవ్యం."
-జై హింద్! ...జై భారత్!

# ఎమ్మెల్సీ శంకర్ నాయక్ కు ఘన సన్మానం



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** తెలంగాణ శాసనమండలి ప్రభుత్వ హామీల కమిటీ చైర్మన్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మిర్యాలగూడలో బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాక ప్రజలందరికీ సక్రమంగా ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నార. అలాగే బలహీనవర్గాలకు ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించే దిశగా కృషి చేస్తానని వారు అన్నారు. పేద వర్గాల కోసం ఇచ్చిన హామీలను అమలు జరిగే దిశగా ప్రభుత్వంతో చర్చలు జరిపి హామీల అమలు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయినిపాలెం గ్రామ సర్పంచ్ చిలకల మురళి యాదవ్,బీసీ యువజన సంఘం జిల్లా కన్వీనర్ సిద్ధం రాజు,నియోజకవర్గ నాయకులు మునగాల శైలేందర్,పట్టణ నాయకులు పట్టేటి రమేష్,పట్టణ కన్వీనర్ ఉపేందర్,రంజిత్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# వాణిజ్యమా, ఆర్థిక ఆధిపత్యమా?

ఒక దేశం ఏ దేశం నుంచి ఏమి కొనాలి? ఎంత కొనాలి? ఏ ధరకు కొనాలి? అనేది ఆ దేశ ఆర్థిక అవసరాలు, జాతీయ ప్రయోజనాలు, మార్కెట్ పరిస్థితులు నిర్ణయించాల్సిన విషయం. అయితే అంతర్జాతీయ రాజకీయాలు వాణిజ్య నిర్ణయాలను ప్రభావితం చేయడం కొత్త విషయం కాదు. కానీ ఇప్పుడు రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై భారీ సుంకాలు విధించే అమెరికా ప్రయత్నం ప్రపంచ వాణిజ్య వ్యవస్థలో ఒక కీలక ప్రశ్నను ముందుకు తెస్తోంది. వాణిజ్యాన్ని ఆర్థిక ఒత్తిడికి, ఆర్థిక ఒత్తిడిని రాజకీయ ఆయుధంగా ఉపయోగించడం ఎంతవరకు సమంజసం? రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యా ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెంచేందుకు అమెరికా, పాశ్చాత్య దేశాలు అనేక ఆంక్షలు విధిస్తున్నాయి. రష్యా చమురు ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయం యుద్ధానికి ఆర్థికంగా ఉపయోగపడుతోందన్నది అమెరికా ప్రధాన వాదన. అందువల్ల రష్యా చమురును కొనుగోలు చేసే దేశాలపై కూడా ఒత్తిడి పెంచడం ద్వారా రష్యా ఆదాయాన్ని తగ్గించవచ్చని అమెరికా భావిస్తోంది. ఈ నేపథ్యంలో రష్యా చమురు కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారం అమెరికా అధ్యక్షుడికి కల్పించే బిల్లు సెనేట్‌లో ఆమోదం పొందడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇది ఇంకా పూర్తిస్థాయి చట్టంగా మారే ప్రక్రియలో ఉన్నప్పటికీ, అంతర్జాతీయ వాణిజ్యానికి ఇది ఒక హెచ్చరిక సంకేతం. ముఖ్యంగా రష్యా చమురును పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తున్న భారత్, చైనా వంటి దేశాలపై దీని ప్రభావం ఉండే అవకాశం ఉంది.

### భారత్‌కు ఇంధనమే ప్రధాన అంశం

భారత్ విషయంలో ఈ సమస్యను కేవలం అమెరికా-రష్యా రాజకీయాల కోణంలో చూడలేం. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద చమురు దిగుమతిదారుల్లో ఒకటి. దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో రవాణా, పరిశ్రమలు, వ్యవసాయం, విద్యుత్, పెట్రోకెమికల్ రంగాలకు నిరంతర ఇంధన సరఫరా అవసరం. రష్యా నుంచి చమురు తక్కువ ధరకు లభించినప్పుడు దాన్ని కొనుగోలు చేయడం భారత రిఫైనరీలకు వాణిజ్యపరంగా ప్రయోజనకరం. చౌకగా ముడి చమురు లభిస్తే రిఫైనింగ్ వ్యయాలు నియంత్రించవచ్చు. దాని ప్రభావం పెట్రోల్, డీజిల్, విమాన ఇంధనం, పెట్రోకెమికల్ ఉత్పత్తుల ధరలపై కూడా పడుతుంది. అందుకే రష్యా నుంచి చమురు కొనుగోలు చేయాలా వద్దా అన్నది భారతదేశానికి కేవలం విదేశాంగ నిర్ణయం కాదు. అది ద్రవ్యోల్బణం, దిగుమతి బిల్లు, రూపాయి విలువ, పరిశ్రమల ఖర్చులు, వినియోగదారుల ధరలు వంటి అనేక అంశాలతో ముడిపడి ఉంది. భారత్ ఇప్పటికే తన వైఖరిని స్పష్టం చేసింది. తమ ఇంధన అవసరాలకు చౌకగా, నిరంతరంగా లభించే చమురును ఎక్కడి నుంచి వస్తే అక్కడి నుంచి కొనుగోలు చేయడం జాతీయ ప్రయోజనమని చెబుతోంది. అంతేకాకుండా యూరప్‌లోని కొన్ని దేశాలు కూడా రష్యా ఇంధనంతో వ్యాపారం కొనసాగిస్తున్న సందర్భంలో భారత్‌ను మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం సమంజసం కాదన్న వాదనను ముందుకు తెస్తోంది.

### సుంకం అంటే కేవలం రాజకీయ ఆయుధం కాదు

సుంకాలు విధించడం ద్వారా ఒక దేశంపై ఆర్థిక ఒత్తిడి తీసుకురావచ్చు. కానీ దాని ప్రభావం రెండు వైపులా ఉంటుంది. ఒక దేశం నుంచి దిగుమతులపై భారీ సుంకం విధిస్తే, ఆ ఉత్పత్తులను కొనుగోలు చేసే దిగుమతిదారులకు కూడా ఖర్చు పెరుగుతుంది. చివరికి ఆ భారం వినియోగదారులపై పడే అవకాశం ఉంటుంది. ఇదే కారణంగా సుంకాల యుద్ధం దీర్ఘకాలంలో ఎవరికీ పూర్తిస్థాయి విజయం ఇవ్వకపోవచ్చు. ఒక దేశం మార్కెట్‌ను కోల్పోతే మరో దేశానికి ప్రత్యామ్నాయ సరఫరాదారులు దొరకవచ్చు. కానీ సరఫరా గొలుసులు మారడానికి సమయం పడుతుంది. పెట్టుబడులు, ఉత్పత్తి ప్రణాళికలు, దీర్ఘకాలిక ఒప్పందాలు అన్నీ అనిశ్చితికి గురవుతాయి. వ్యాపార ప్రపంచానికి అనిశ్చితి అంటే అదనపు ఖర్చు. రేపు సుంకం ఎంత ఉంటుందో తెలియని పరిస్థితిలో కంపెనీలు భారీ పెట్టుబడులు పెట్టడానికి వెనుకాడతాయి. దీని ప్రభావం చివరికి ఉపాధి, ఉత్పత్తి, పెట్టుబడులు, అంతర్జాతీయ వాణిజ్యంపై పడుతుంది.

### భారత్‌కు సవాలు.. అవకాశమూ

అమెరికా ఒత్తిడిని భారత్ ఎదుర్కొంటున్న సమయంలో ఒక ముఖ్యమైన విషయం స్పష్టమవుతోంది. ఏ ఒక్క దేశంపై అధికంగా ఆధారపడటం వ్యూహాత్మకంగా ప్రమాదకరం. రష్యా నుంచి చమురు చౌకగా లభించడం భారత్‌కు ప్రయోజనం అయినప్పటికీ, భవిష్యత్తులో సరఫరా సమస్యలు లేదా ఆంక్షలు ఎదురైతే ప్రత్యామ్నాయ వనరులు సిద్ధంగా ఉండాలి. అందుకే భారత్ దీర్ఘకాలంలో వాణిజ్య వైవిధ్యాన్ని పెంచుకోవాలి. రష్యాతో సంబంధాలు కొనసాగిస్తూనే అమెరికా, మధ్యప్రాచ్యం, ఆఫ్రికా, లాటిన్ అమెరికా తదితర ప్రాంతాలతో ఇంధన వాణిజ్యాన్ని విస్తరించాలి. దేశీయంగా పునరుత్పాదక ఇంధనం, ఎలక్ట్రిక్ వాహనాలు, గ్రీన్ ఎనర్జీ, ప్రత్యామ్నాయ ఇంధనాలపై పెట్టుబడులు పెంచాలి. ఇది కేవలం ఇంధన భద్రతకే కాదు.. భవిష్యత్తులో అంతర్జాతీయ సుంకాల ఒత్తిడిని ఎదుర్కొనే ఆర్థిక రక్షణకు కూడా అవసరం.

### వాణిజ్య సంబంధాలు రాజకీయ బందీలుగా మారకూడదు

రష్యాపై అమెరికా ఆంక్షలకు భౌగోళిక రాజకీయ కారణాలు ఉన్నాయి. ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేందుకు రష్యాపై ఆర్థిక ఒత్తిడి అవసరమని అమెరికా భావించడం అర్థం చేసుకోవచ్చు. కానీ ఆ ఒత్తిడిని ఇతర దేశాల స్వతంత్ర వాణిజ్య నిర్ణయాలను మార్చేందుకు ఉపయోగించడం మాత్రం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కొత్త సమస్యలకు దారితీస్తుంది. ఒక దేశం తన జాతీయ ప్రయోజనాల కోసం వాణిజ్య నిర్ణయాలు తీసుకోవడం సహజం. అదే సమయంలో ఆ నిర్ణయాలు అంతర్జాతీయ బాధ్యతలకు విరుద్ధంగా ఉన్నాయా లేదా అన్నదానిపై చర్చ జరగవచ్చు. కానీ చర్చకు బదులుగా సుంకాల బెదిరింపులు ప్రధాన సాధనంగా మారితే.. ప్రపంచ వాణిజ్యం నియమాల ఆధారంగా కాకుండా శక్తి సమీకరణాల ఆధారంగా నడిచే ప్రమాదం ఉంది. ప్రపంచీకరణ కాలంలో దేశాలు ఒకదానిపై ఒకటి ఆధారపడటం ఆర్థిక బలంగా భావించేవి. ఇప్పుడు అదే ఆధారపడటాన్ని దేశాలు వ్యూహాత్మక ఆయుధంగా ఉపయోగించుకుంటున్నాయి. చమురు, గ్యాస్, సెమీకండక్టర్లు, అరుదైన ఖనిజాలు, టెక్నాలజీ వంటి రంగాల్లో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఇది గ్లోబలైజేషన్ నుంచి జియో-ఎకనామిక్స్ వైపు ప్రపంచం కదులుతున్న సంకేతం.

### భారత్ ముందున్న మార్గం

ఈ పరిస్థితిలో భారత్ భావోద్వేగ నిర్ణయాల కంటే ఆర్థిక ప్రయోజనాలను ముందుపెట్టాలి. రష్యా చమురు చౌకగా ఉంటే కొనుగోలు చేయడం, ప్రత్యామ్నాయ వనరులు మెరుగైన ధరకు లభిస్తే అక్కడి నుంచి కొనుగోలు చేయడం.. ఇదే మార్కెట్ ఆర్థిక వ్యవస్థకు సహజమైన విధానం. అమెరికాతో సంబంధాలు కూడా భారత్‌కు అత్యంత కీలకం. అమెరికా భారతదేశానికి ప్రధాన ఎగుమతి మార్కెట్, పెట్టుబడి భాగస్వామి, సాంకేతిక సహకార దేశం. అదే సమయంలో రష్యా కూడా ఇంధనం, రక్షణ, వ్యూహాత్మక రంగాల్లో కీలక భాగస్వామి. కాబట్టి ఒక దేశాన్ని ఎంచుకుని మరొక దేశాన్ని వదిలేయడం కంటే.. అందరితో ప్రయోజనకరమైన సంబంధాలను కొనసాగించడమే భారత వ్యూహంగా ఉండాలి. చివరికి రష్యా చమురు వివాదం ఒక పెద్ద పాఠాన్ని నేర్పుతోంది. ఆర్థిక స్వావలంబన అంటే ఎవరి నుంచి కొనకపోవడం కాదు.. ఎవరైనా ఒత్తిడి తెచ్చినా మనకు ప్రత్యామ్నాయాలు ఉండేలా ఆర్థిక వ్యవస్థను నిర్మించుకోవడం. భారత్‌కు బలమైన సమాధానం సుంకాల యుద్ధం కాదు. బలమైన సరఫరా గొలుసులు, విస్తృత వాణిజ్య భాగస్వామ్యాలు, ఇంధన వనరుల వైవిధ్యం, దేశీయ ఉత్పత్తి సామర్థ్యం. వాణిజ్యం రాజకీయాలకు అతీతం కావాల్సిన అవసరం లేకపోయినా.. అది పూర్తిగా రాజకీయ బెదిరింపుల ఆధీనంలోకి వెళ్లకూడదు. దేశాల మధ్య విభేదాలు ఉండొచ్చు. ఆంక్షలు ఉండొచ్చు. కానీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు చివరికి అవసరమయ్యేది నియమాల ఆధారిత వాణిజ్యం, పారదర్శక విధానాలు, పరస్పర గౌరవం. చమురు కోసం మొదలైన సుంకాల పోరు.. రేపు మరే వస్తువుకైనా వర్తించే పరిస్థితి రాకూడదు. లేదంటే నష్టం ఒక్క భారత్‌కో, రష్యాకో, అమెరికాకో పరిమితం కాదు. ప్రపంచ వ్యాపార వ్యవస్థ మొత్తం దాని ధర చెల్లించాల్సి వస్తుంది.

# తెలంగాణ ఆలోచన.. దేశం అనుసరణ

## నాడు వద్దన్న విధానమే... నేడు దేశానికి ఆదర్శం

### రైతు సమస్యను పాలనా సంస్కరణగా మార్చిన ప్రయత్నం



### రైతు అనుభవమే తుది తీర్పు

తెలంగాణలో ప్రారంభమైన ఈ ప్రయోగం నిజంగా దేశానికి దిక్సూచిగా మారితే.. అది రాష్ట్రానికి మాత్రమే కాదు, దేశ వ్యవసాయ పరిపాలనకూ ఒక ముఖ్యమైన పరిణామమే. అయితే ఆ ప్రయోగం విజయవంతం కావాలంటే సాంకేతికతతో పాటు మానవీయత, పారదర్శకత, అందుబాటు కూడా ఉండాలి. రైతు చేతిలో ఎరువు బస్తా సరైన సమయంలో చేరడం.. అదే ఏ ప్రభుత్వానికైనా అసలైన విజయపత్రం. రాజకీయాలు మారుతాయి. ప్రభుత్వాలు మారుతాయి. విధానాలకు పేర్లు మారవచ్చు. కానీ రైతు అవసరం మాత్రం మారదు. "అవసరమైన సమయంలో.. అవసరమైన ఎరువు.. అవసరమైన రైతుకు" చేరే వ్యవస్థను నిర్మించగలిగితేనే ఈ సంస్కరణకు నిజమైన అర్థం ఉంటుంది. తెలంగాణ ఆలోచన దేశం అనుసరిస్తోందన్న రాజకీయ సందేశం కంటే.. ఆ ఆలోచన రైతు జీవితాన్ని ఎంత సులభతరం చేసిందన్నదే చరిత్రలో నిలిచే అసలైన విషయం.

ఒక కొత్త ఆలోచన పుట్టినప్పుడు దానికి వ్యతిరేకత రావడం సహజం. ముఖ్యంగా ఆ ఆలోచన పాత విధానాలను మార్చే ప్రయత్నం చేసినప్పుడు రాజకీయ విమర్శలు, అనుమానాలు, ఆచరణలో ఎదురయ్యే ఇబ్బందులు తప్పవు. అయితే ఒక సంస్కరణ నిజంగా ప్రజల అవసరాలను తీర్చగలిగితే.. కాలమే దానికి సమాధానం చెబుతుంది. తెలంగాణలో ఎరువుల పంపిణీ కోసం ప్రవేశపెట్టిన మొబైల్ ఫెర్టిలైజర్ బుకింగ్ విధానం ఇప్పుడు అలాంటి చర్చకే కేంద్రంగా మారింది. ప్రారంభంలో విమర్శలు ఎదుర్కొన్న ఈ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా విస్తరించే దిశగా అడుగులు వేస్తుండటం రాష్ట్ర ప్రభుత్వానికి రాజకీయంగానూ, పాలనా పరంగానూ ఒక అవకాశంగా మారింది. రైతుకు ఎరువు అంటే కేవలం ఒక వ్యవసాయ ఉత్పత్తి కాదు. పంట దిగుబడితో నేరుగా ముడిపడిన కీలకమైన వ్యవసాయ ఇన్‌పుట్. విత్తనం వేసిన తర్వాత సరైన సమయంలో ఎరువు అందకపోతే రైతు మొత్తం సాగు ప్రణాళికే దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. అందుకే ఎరువుల కొరత, క్యూలు, బ్లాక్ మార్కెట్, అక్రమ నిల్వలు వంటి అంశాలు రైతుల్లో ఎప్పటికప్పుడు ఆందోళన కలిగించే సమస్యలుగా ఉన్నాయి. గతంలో ఎరువుల పంపిణీలో ఆధార్ ఆధారిత వ్యవస్థకు ప్రధాన ప్రాధాన్యం ఉండేది. అయితే ఒక వ్యక్తి పేరుపై ఆధార్ ఉండటం, అతను వాస్తవంగా ఎంత భూమిని సాగు చేస్తున్నాడు, ఏ పంట పండిస్తున్నాడు, ఆ పంటకు ఎంత ఎరువు అవసరం అన్న విషయాలను పూర్తిగా ప్రతిబింబించదు. ఫలితంగా అవసరానికి మించి ఎరువులు కొనుగోలు చేయడం, ఇతర మార్గాల్లోకి మళ్లించడం, సబ్సిడీ ప్రయోజనం నిజమైన సాగుదారుడికి కాకుండా ఇతరులకు చేరడం వంటి సమస్యలకు అవకాశం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో సాగులో ఉన్న భూమిని ప్రాతిపదికగా తీసుకుని ఎరువుల అవసరాన్ని నిర్ణయించాలన్న ఆలోచన ఒక విధానపరమైన మార్పు. సొంత భూమి సాగు చేసే రైతుతో పాటు కౌలు రైతును కూడా వ్యవస్థలో గుర్తించడం, పంట రకం మరియు సాగు విస్తీర్ణాన్ని పరిగణనలోకి తీసుకోవడం ద్వారా ఎరువుల పంపిణీని అవసరానికి అనుగుణంగా మార్చాలన్నది ఈ విధానం లక్ష్యం. ఇది కేవలం సాంకేతిక మార్పు కాదు. ప్రభుత్వ సబ్సిడీని ఎవరికి, ఎంతవరకు అందించాలి అనే ప్రశ్నకు సమాధానం వెతికే పరిపాలనా సంస్కరణ. అయితే సంస్కరణలు కాగితంపై రూపొందించడం ఒకటి.. వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయడం మరోటి. మొబైల్ యాప్‌ను ఉపయోగించడం, స్టాక్‌ను ముందుగానే తెలుసుకోవడం, బుకింగ్ చేసుకుని డీలర్ వద్దకు వెళ్లడం వంటి విధానాలకు రైతులు అలవాటు పడటానికి సమయం పట్టింది. సాంకేతిక సమస్యలు కూడా తలెత్తాయి. డీలర్లకు కొత్త వ్యవస్థను అర్థం చేసుకోవాల్సి వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్ వినియోగం వంటి అంశాలు కూడా సవాళ్లుగా మారాయి. ఇలాంటి సమయంలో రాజకీయ విమర్శలు రావడం సహజమే. కొత్త విధానంలో ఏర్పడిన ఇబ్బందులను ప్రతిపక్షాలు ప్రభుత్వ వైఫల్యంగా చూపించే ప్రయత్నం చేశాయి. బీఆర్ఎస్ నేతలు ఈ విధానాన్ని తీవ్రంగా విమర్శించగా, కొందరు బీజేపీ నేతలు కూడా అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ప్రభుత్వం మాత్రం వెనక్కి తగ్గకుండా సమస్యలను సరిదిద్దుకుంటూ వ్యవస్థను ముందుకు తీసుకెళ్లింది. ఇక్కడే ఒక సంస్కరణకు రాజకీయ పరీక్ష మొదలైంది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కూడా ఎరువుల పంపిణీని మరింత డిజిటలైజ్ చేసే దిశగా అడుగులు వేస్తోందన్న అంశాన్ని తెలంగాణ ప్రభుత్వం తనకు అనుకూలంగా ఉపయోగించుకుంటోంది. తెలంగాణలో మొదట ప్రయోగించిన ఆలోచనను దేశవ్యాప్తంగా విస్తరించేందుకు కేంద్రం సిద్ధమవుతోందని పేర్కొంటూ.. అప్పట్లో ఈ విధానాన్ని విమర్శించిన వారిని ప్రభుత్వం ప్రశ్నిస్తోంది. ముఖ్యంగా బీజేపీ నేతలకు ఇది రాజకీయంగా ఇబ్బందికరమైన ప్రశ్నగా మారవచ్చు. రాష్ట్రంలో వ్యతిరేకించిన విధానం కేంద్ర స్థాయిలో స్వీకరించబడితే, రాష్ట్ర బీజేపీ నాయకత్వం తన పాత విమర్శలను ఎలా సమర్థించుకుంటుందన్న ప్రశ్న తలెత్తుతుంది. అదే సమయంలో బీఆర్ఎస్‌పైనా కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయంగా దాడి చేసే అవకాశం పొందుతోంది. తెలంగాణలో తమ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణను అప్పట్లో వ్యతిరేకించారని, ఇప్పుడు అదే విధానం దేశవ్యాప్తంగా చర్చకు వస్తోందని చెప్పడం ద్వారా పాలనా సామర్థ్యంలో తాము ముందున్నామనే నేరేటివ్‌ను నిర్మించుకోవాలని చూస్తోంది. ఇక్కడే ఈ అంశం కేవలం ఎరువుల పంపిణీ సమస్య నుంచి రాజకీయ క్రెడిట్ పోటీగా మారింది. "ఈ ఆలోచన ఎవరిది?", "ఎవరు మొదట అమలు చేశారు?", "ఎవరి విధానం దేశవ్యాప్తంగా అనుసరించబడుతోంది?" అనే ప్రశ్నలు రాజకీయ ప్రచారంలోకి వచ్చాయి. ప్రజాస్వామ్యంలో విధానాలపై చర్చ జరగడం సహజమే. కానీ రైతు ప్రయోజనానికి ఉపయోగపడే విధానం ఏ పార్టీకి చెందినదన్నదానికంటే, అది రైతుకు ఎంత మేలు చేస్తుందన్నదే అసలు ప్రమాణం కావాలి. అయితే తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ విజయాన్ని కేవలం రాజకీయ ప్రచారంగా మార్చకుండా జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. కేంద్రం ఒక విధానాన్ని స్వీకరించిందని చెప్పడం మాత్రమే దాని విజయానికి తుది ధ్రువీకరణ కాదు. రైతు వాస్తవ అనుభవమే అసలు పరీక్ష. యాప్‌లో బుకింగ్ చేసిన తర్వాత నిజంగా అదే డీలర్ వద్ద ఎరువు అందుబాటులో ఉందా? రైతు బుక్ చేసిన పరిమాణం సమయానికి లభిస్తుందా? గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక సమస్యలు ఎంతవరకు తగ్గాయి? కౌలు రైతులకు ఈ వ్యవస్థ సులభంగా అందుబాటులో ఉందా? వంటి ప్రశ్నలకు సమాధానాలు అవసరం. ప్రత్యేకంగా డిజిటల్ వ్యవస్థల విషయంలో "సాంకేతికత అందరికీ సమానంగా అందుబాటులో ఉందా?" అనే ప్రశ్న చాలా కీలకం. స్మార్ట్‌ఫోన్ లేని రైతు ఉంటే? యాప్ ఉపయోగించడం తెలియని వృద్ధ రైతు ఉంటే? ఇంటర్నెట్ సౌకర్యం లేని గ్రామం ఉంటే? బుకింగ్ ప్రక్రియలో సమస్య ఎదురైతే ఎవరిని సంప్రదించాలి? వంటి అంశాలకు ప్రత్యామ్నాయ వ్యవస్థలు ఉండాలి. లేదంటే రైతును క్యూలో నిలబడకుండా చేయాలన్న లక్ష్యం మరో విధంగా రైతును సాంకేతిక సమస్యల ముందు నిలబెట్టే పరిస్థితికి దారితీయవచ్చు. ఇక సబ్సిడీ ఎరువుల దుర్వినియోగాన్ని అరికట్టడం కూడా ఈ వ్యవస్థలో ముఖ్యమైన అంశం. ప్రభుత్వం భారీగా సబ్సిడీ ఇస్తున్న ఎరువు నిజమైన సాగుదారుడికే చేరాలి. అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలు, వ్యవసాయేతర అవసరాలకు మళ్లింపు వంటి సమస్యలను నియంత్రించగలిగితే ఈ విధానానికి మరింత విశ్వసనీయత వస్తుంది. అయితే ఇందుకోసం కేవలం యాప్ సరిపోదు. సరఫరా గొలుసు మొత్తం పారదర్శకంగా ఉండాలి. డీలర్ స్థాయి నుంచి గోదాం స్థాయి వరకు స్టాక్ నిర్వహణలో సమన్వయం అవసరం. ఈ సంస్కరణలో మరో ముఖ్యమైన రాజకీయ కోణం ఉంది. తెలంగాణ ప్రభుత్వం దీన్ని తన పాలనా మోడల్‌లో ఒక విజయగాథగా చూపించుకోవచ్చు. "తెలంగాణలో పుట్టిన ఆలోచన.. దేశం అనుసరిస్తోంది" అనే నినాదం ద్వారా రాష్ట్రం జాతీయ స్థాయిలో కొత్త విధానాలకు మార్గదర్శకంగా నిలుస్తోందనే భావనను ప్రజల్లోకి తీసుకెళ్లవచ్చు. ఇది ముఖ్యంగా వచ్చే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో పాలనా పనితీరును చర్చకు తెచ్చే ప్రయత్నంలో ఉపయోగపడే అవకాశం ఉంది. అయితే ప్రతిపక్షాలు కూడా దీనికి ప్రత్యామ్నాయ వాదనను ముందుకు తీసుకురావచ్చు. కేంద్రం తీసుకున్న విధానం తెలంగాణ విధానంతో పూర్తిగా సమానమా? రెండింటి మధ్య ఉన్న తేడాలేమిటి? కేంద్రం ఎందుకు తీసుకొచ్చింది? తెలంగాణలో అమలైన వ్యవస్థ వల్ల రైతులకు వాస్తవంగా ఎంత ప్రయోజనం కలిగింది? అనే ప్రశ్నలను లేవనెత్తవచ్చు. కాబట్టి ప్రభుత్వం కేవలం రాజకీయ ప్రకటనలపై ఆధారపడకుండా గణాంకాలు, రైతుల అనుభవాలు, పంపిణీ మెరుగుదల, అక్రమాల నియంత్రణ వంటి అంశాలను ఆధారాలతో ప్రజల ముందు ఉంచాల్సి ఉంటుంది. రాజకీయాల్లో ఒక కొత్త విధానానికి ప్రారంభంలో వ్యతిరేకత రావడం తప్పు కాదు. ప్రతిపక్షం ప్రశ్నించడం కూడా ప్రజాస్వామ్య వ్యవస్థలో అవసరమే. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ప్రశ్నించకుండా స్వీకరించడం వల్లే పాలన మెరుగుపడదు. అదే సమయంలో ప్రతి సంస్కరణను రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే వ్యతిరేకించడం కూడా ప్రజా ప్రయోజనానికి ఉపయోగపడదు. చివరికి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే విధానాలను రాజకీయ విభేదాలకు అతీతంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఎరువుల పంపిణీ విషయంలో కూడా ఇదే వర్తిస్తుంది. రైతుకు ఎరువు సమయానికి దొరికితే, అతను గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన అవసరం లేకపోతే, తనకు అవసరమైన పరిమాణం మాత్రమే లభిస్తే, సబ్సిడీ దుర్వినియోగం తగ్గితే.. ఆ సంస్కరణకు విలువ ఉంది. ఆ విలువను ఏ పార్టీ పేరుతో పిలిచినా రైతు ప్రయోజనం మారదు. అందువల్ల ఈ వ్యవహారాన్ని "ఎవరి క్రెడిట్?" అనే ప్రశ్నతో ముగించడం కంటే "రైతుకు ఎంత ప్రయోజనం?" అనే ప్రశ్నతో చూడాలి. తెలంగాణ ప్రభుత్వం ఈ విధానం తమ ఆలోచనకు జాతీయ స్థాయిలో లభించిన గుర్తింపు అని చెబుతోంది. ప్రతిపక్షాలు దానిని రాజకీయ ప్రచారంగా విమర్శించవచ్చు. కానీ తుది తీర్పు మాత్రం రాజకీయ నాయకుల చేతిలో ఉండదు.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539
flashindia999@gmail.com

# మేము భారత సైన్యంలో చేరుతాం..

**నేపాల్ :** భారత సైన్యంలో చేరే అవకాశం కోసం నేపాల్ యువత, పూర్వ గోర్ఖా సైనికులు రోడ్డెక్కారు. తమ దేశపు యువతను భారత సైన్యంలోని 'అగ్నిపథ్' పథకం కింద ఎంపిక చేసుకునే ప్రక్రియను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ నేపాల్‌లోని పోఖరా నగరంలో విస్తృత నిరసనలు చేపట్టారు. ఈ ఆందోళనల వెనుక తరతరాల చరిత్ర, వేలాది కుటుంబాల ఉపాధి ఆశలు దాగి ఉన్నాయి. 1815లో సుగౌలీ ఒప్పందం కాలంతో పాటు ఆ తర్వాత 1947 భారత స్వాతంత్ర్యం నుంచి కూడా నేపాల్ గోర్ఖాలు భారత సైన్యంలో చేరి అపారమైన శౌర్యప్రతాపాలు చూపిస్తున్నారు. దాదాపు 207 ఏళ్లకు పైగా నిరాటంకంగా సాగిన ఈ సుదీర్ఘ సంప్రదాయానికి 2020లో కరోనా మహమ్మారి వల్ల తాత్కాలికంగా విరామం పడింది. అయితే, 2022లో భారత్ తీసుకొచ్చిన సైనిక నియామక నమూనా 'అగ్నిపథ్' ఈ విరామాన్ని కాస్తా వివాదంగా మార్చేసింది. ఈ నూతన విధానం కింద అగ్నివీరులుగా చేరేవారు నాలుగేళ్లు మాత్రమే సేవలు అందిస్తారు. ఆ తర్వాత కేవలం 25 శాతం మందిని మాత్రమే పూర్తిస్థాయి సేవలకు ఉంచుకుంటారు. తక్కువ కాలపరిమితి, పదవీ విరమణ తర్వాత సైనికుల భవిష్యత్తుపై స్పష్టత లేకపోవడం, పూర్వపు త్రైపాక్షిక ఒప్పందాలకు ఇది భిన్నంగా ఉందనే కారణాలతో నేపాల్ ప్రభుత్వం ఈ రిక్రూట్‌మెంట్‌ను నిలిపివేసింది.ప్రస్తుతం 'ఇండియన్ ఎక్స్-సర్వీస్‌మెన్ గోర్ఖా బ్రిగేడ్ నేపాల్' ఆధ్వర్యంలో మాజీ సైనికులు, వారి కుటుంబాలు, మిలిటరీ శిక్షణ పొందుతున్న యువకులు పోఖరాలో భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిపాలనా అధికారి ద్వారా నేపాల్ ఫెడరల్ ప్రభుత్వానికి రెండు ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. అగ్నిపథ్ కింద నియామకాలు వెంటనే ప్రారంభించాలని, అలాగే తమ పేర్లలో 'సైనికుడు' అనే పదాన్ని ఉపయోగిస్తున్న మాజీ సైనిక సంస్థల గుర్తింపును పునరుద్ధరించాలని వారు కోరారు. ఈ ఆందోళనలో పాల్గొన్న బ్రిగేడ్ ఛైర్మన్ కల్నల్ కృష్ణ బహదూర్ ఖత్రీ మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల యువత ఉద్యోగావకాశాలు కోల్పోవడమే కాకుండా, మన పూర్వీకులు రక్తం చిందించి సంపాదించుకున్న వీరత్వ చరిత్ర తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం ఉందన్నారు. నాలుగేళ్ల అగ్నిపథ్ కాలంలోనే యువకులు దాదాపు 45 నుంచి 50 లక్షల రూపాయల వరకు సంపాదించుకోవచ్చని వినతిపత్రంలో పేర్కొన్నారు. 50 డిగ్రీల తీవ్రమైన ఎండలో గల్ఫ్ దేశాలకు వెళ్లి అల్ప వేతనానికి కష్టపడటం కంటే, భారత సైన్యంలో చేరడం వంద రెట్లు మెరుగైన ఉపాధి మార్గమని స్పష్టం చేశారు.మరోవైపు, భారత్ తన వైఖరిని స్పష్టం చేసింది. భారతీయులకు ఒక నియమం, నేపాల్ పౌరులకు మరొక నియమం పెట్టలేమని, అగ్నిపథ్ విధానంలో అందరికీ ఒకే రకమైన నిబంధనలు ఉంటాయని పూర్వ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ గతంలోనే వెల్లడించారు. అంతిమంగా నిర్ణయం తీసుకోవాల్సింది నేపాల్ ప్రభుత్వమేనని ఆయన తేల్చి చెప్పారు. మరోవైపు.. ఈ ఉద్రిక్తతల మధ్యే భారత సైనిక దళాల అధిపతి జనరల్ ధీరజ్ సేథ్ ఐదు రోజుల పర్యటన నిమిత్తం నేపాల్ వెళ్లనున్నారు. పర్యటనలో భాగంగా ఆయన నేపాల్ ప్రెసిడెంట్ రామ్‌చంద్ర పౌడెల్ చేతుల మీదుగా 'జనరల్ ఆఫ్ ది నేపాలి ఆర్మీ' గౌరవ హోదాను అందుకోనున్నారు. అలాగే నేపాల్ ప్రధాని బాహెంద్ర షాను కూడా కలిసే అవకాశం ఉంది. ఒకవైపు దశాబ్దాల సైనిక మైత్రి సాంప్రదాయబద్ధంగా కొనసాగుతుండగా, మరోవైపు ఉపాధి ఆశలతో ఉన్న గోర్ఖా యువత తమ డిమాండ్లు నెరవేరకపోతే ఆందోళనలను మరింత తీవ్రం చేస్తామని హెచ్చరిస్తున్నారు.



# 23 నుంచి ఆటోల బంద్!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23వ తేదీ అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆటో, క్యాబ్, పాఠశాల వ్యాన్ డ్రైవర్ల నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చినట్లు కార్మిక సంఘాల నేతలు వెల్లడించారు. రాష్ట్ర ఆటో, యాప్ ఆధారిత సంఘాల ఐకాస ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య కళానిలయంలో గురువారం జరిగిన ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్ల సమావేశంలో 17 కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు. ప్రభుత్వం నుంచి తక్షణ స్పందన రాకపోతే ఆటో బంద్‌లో భాగంగా ముఖ్యమంత్రి నివాసంతో పాటు అసెంబ్లీ, ప్రజాభవన్ ముట్టడి కార్యక్రమాలు చేపడతామని, లక్షల ఆటోలతో హైదరాబాద్‌ను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు.

**ప్రధాన డిమాండ్లు ఇవే**

ఆటో, రవాణా రంగ కార్మికుల భద్రత, సంక్షేమం కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలి.

పెరిగిన పెట్రోలు, డీజిల్, గ్యాస్ మరియు నిత్యవసర సరుకుల ధరలకు అనుగుణంగా ఆటో మీటరు ఛార్జీలను సవరించి పెంచాలి.

ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి ప్రైవేట్ అగ్రిగేటర్లకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వమే కొత్త రవాణా యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలి.

ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు హామీ ఇచ్చిన రూ. 12,000 ఆర్థిక సహాయ పథకాన్ని తక్షణమే అమలు చేయాలి.

# సలహాదారుకు సలహాదారులు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర నీటి పారుదల శాఖలో వింత ధోరణి కనిపిస్తున్నది. ఏకంగా సలహాదారుకే ఇద్దరు సలహాదారులను నియమించడం ఇప్పుడు చర్చకు దారితీసింది. ఇప్పటికే నీటి పారుదల శాఖకు సలహాదారుగా ఆదిత్యనాథ్ దాస్ కొనసాగుతుండగా.. ఆయనకు అసిస్టెంట్లుగా పనిచేసేందుకు మరో ఇద్దరిని నియమించారు. దాంతో ఆ శాఖలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్న వారితో సరిగా పనులు చేయించుకోకుండా.. రిటైర్డ్ అయిన వారిని తీసుకొచ్చి సలహాదారులుగా పెడుతుండడంతో సీనియర్లలో అసంతృప్తి కనిపిస్తున్నది. పెద్ద మొత్తంలో జీతభత్యాలు ఇస్తుండడం.. సదుపాయాలు కల్పించడంతో పెదవి విరుస్తున్నారు. అంతేకాకుండా.. గతంలో అవినీతి ఆరోపణలు ఉన్న వ్యక్తిని తీసుకొచ్చి పెట్టడంపైనా విమర్శలు వస్తున్నాయి.

**టెక్నికల్ కన్సల్టెంట్‌గా బాధ్యతలు..**

గతంలో చీఫ్ ఇంజినీర్‌గా పనిచేసిన సత్యానంద్‌ను ప్రభుత్వం నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించింది. ఈ మేరకు జీవో 1109 జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ జె.సత్యానంద్‌ను టెక్నికల్ కన్సల్టెంట్‌గా నియమిస్తూనే.. మరో రిటైర్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ డి.విష్ణుకుమార్ శర్మను ఫైనాన్షియల్ కన్సల్టెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వీరు నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ప్రభుత్వ సలహాదారుకు సహకరించనున్నారు. కాగా.. ఈ ఇద్దరి సేవలను 2027 మార్చి 31 వరకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన వినియోగించుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఇందుకు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సేవలకు సంబంధించిన నిబంధనలను పాటించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ప్రతీ కన్సల్టెంట్‌కు నెలకు రూ.2 లక్షల చొప్పున పారితోషికం చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ మొత్తంలో అన్ని రకాల పెర్క్‌లు కూడా కలిపి ఉంటాయని ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రిటైర్డ్ అధికారుల సేవలను వినియోగించుకునే విషయంలో అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖను ఆదేశించింది.

**సత్యానంద్‌పై ఆరోపణలు**

గతంలో సత్యానంద్‌కు జలయజ్ఞంలోనూ పనిచేసిన అనుభవం ఉన్నది. తుమ్మిడిహెట్టి పరిధిలోని నిర్మించ తలపెట్టిన ప్రాణహిత-చేవెళ్లకు ఏండ్లపాటు సీఈగా సేవలందించారు. మొబిలైజేషన్ అడ్వాన్సులు.. ఇతరత్రా అవసరాలను ఆయనే చూశారు. ఆ సమయంలోనే ఆయనపై పలురకాల ఆరోపణలు ఉన్నాయని శాఖలోని ఉద్యోగులు అంటున్నారు. చాలా పనుల్లో అవినీతికి పాల్పడ్డారని ఆరోపిస్తున్నారు. దాంతో ఇప్పుడు ఆయనను సలహాదారుగా నియమించడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అందులోనూ రిటైర్డ్ అయిన వ్యక్తిని సలహాదారుగా తీసుకోవడంపైనా విమర్శలు చేస్తున్నారు.

# దొడ్డిదారిన ఇంక్రిమెంట్లు!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతర్ చేస్తూ కొందరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్స్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరు ఆలస్యంగా వెలుగుచూసింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులు, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ ఆదేశాలను పక్కనబెట్టి నిబంధనలకు విరుద్ధంగా కొందరు ప్రిన్సిపాల్స్ జూనియర్ లెక్చరర్ల(జేఎల్)లకు ఇంక్రిమెంట్లు మంజూరు చేసినట్టు తెలిసింది. ఇటీవల ఫేక్ ఎన్వోసీల వ్యవహారం, ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన లెక్చరర్ల వ్యవహారంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా లెక్చరర్లకు రెండు ఇంక్రిమెంట్ల ఉదంతం విద్యాశాఖ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల షోకాజ్ నోటీసులు అందుకున్న లెక్చరర్లలో ఇంక్రిమెంట్లు పొందినవారూ ఉండటం గమనార్హం.

**సుప్రీంకోర్టు ఆదేశాలు**

రాష్ట్రవ్యాప్తంగా 2023లో సుమారు మూడు వేల మంది లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయగా కోర్టు ఆదేశాల మేరకు వారందరికీ ఇంక్రిమెంట్లు నిలిపివేశారు. అయితే, ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ నిరుద్యోగ యువత సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో సదరు లెక్చరర్లకు ఎలాంటి సర్వీసు బెనిఫిట్స్ కల్పించవద్దని అత్యున్నత నాయస్థానం స్టే విధించింది. సదరు అధ్యాపకులకు ఎలాంటి వార్షిక ఇంక్రిమెంట్లు ఇవ్వకూడదని, పోలీసు ఎంక్వయిరీ తర్వాత తగిన నిర్ణయం తీసుకోవాలని గతంలో ఉన్న ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ స్పష్టమైన ఆదేశాలిచ్చారు. విచారణ కోసం ఓ కమిటీని సైతం ఏర్పాటుచేశారు. నాటి నుంచి సదరు అధ్యాపకులకు రెండవ, మూడవ ఇంక్రిమెంట్లు నిలిచిపోయాయి.

**వెలుగులోకి ఇలా..**

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పనిచేస్తున్న 13 మంది కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అయితే, గతంలో ఉన్న డైరెక్టర్ బదిలీ కావడంతో కొత్తగా బాధ్యతలు చేపట్టిన డైరెక్టర్ నుంచి ఎలాంటి స్పష్టమైన ఉత్తర్వులు రాకముందే సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మే 2026లో నిబంధనలు ఉల్లంఘించారు. 13 మంది అధ్యాపకులకు రెండు వార్షిక ఇంక్రిమెంట్లతో పాటు ఏరియర్స్ మంజూరు చేశారు. ఒక్కో అధ్యాపకుడికి సుమారు రూ.62వేల చొప్పున ఏరియర్స్ బిల్లును ట్రెజరీ అధికారుల ద్వారా మంజూరు చేయించడం గమనార్హం.

**చేతివాటం ఆరోపణలు**

నిబంధనలకు విరుద్ధంగా ఇంక్రిమెంట్లు మంజూరు చేయడం వెనక కాలేజీ ప్రిన్సిపాళ్లతో పాటు ట్రెజరీ ఆఫీసు సిబ్బంది భారీగానే చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు ఉన్నాయి. ఆయా కాలేజీల్లో పనిచేసే సీనియర్ అసిస్టెంట్లకు కనీసం సమాచారం లేకుండానే రహస్యంగా ఈ ఇంక్రిమెంట్ బిల్లులను ఆమోదింపజేస్తున్నట్టు తెలుస్తోంది. కొన్నిచోట్ల లబ్ధిపొందిన అధ్యాపకులు తమకు ఇంక్రిమెంట్ మంజూరైనట్టు నోటిమాటగా చర్చించుకోవడం, మరికొన్ని చోట్ల ఇటీవల ఇంటర్ విద్యాశాఖ ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల లిస్టు బయటికి రావడంతో ఇప్పుడిప్పుడే విషయాలు బయటికొస్తున్నాయి.మరోవైపు, ఇతర ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులు తమకు కూడా ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని ఆయా ప్రిన్సిపాళ్లను కోరగా కమిషనర్ నుంచి ఎలాంటి స్పష్టమైన ఉత్తర్వులు లేవు, తాము ఇవ్వలేమని చెబుతున్నారు. కానీ రాష్ట్రవ్యాప్తంగా మూడు జిల్లాల్లో ఇలాంటి ఘటనలు జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కమిషనర్ ఆదేశాలు, కోర్టు ఉత్తర్వులను బేఖాతర్ చేస్తూ సాగిన ఈ ఇంక్రిమెంట్ల వ్యవహారంపై ఇంటర్మీడియట్ కమిషనర్ చర్యలు చేపట్టాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# ఏకంగా సగం ఓట్లు మాయం



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియ ఈ నెల 10వ తేదీన ముగిసింది. దీంతో హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో ఓటర్ల లెక్క తేల్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. సర్ ప్రక్రియ ముగిసిన తర్వాత జిల్లాలో గణనీయంగా ఓట్ల సంఖ్య తగ్గింది. జిల్లాలో సర్‌కు ముందు మొత్తం ఓటర్లు 47,35,315 మంది ఓటర్లు ఉండగా.. 58.89 శాతంతో తాజాగా 27,76,624 డిజిటలైజ్ అయ్యాయి. 19.5 లక్షల మంది ఓటర్ల వివరాలు లభ్యం కాలేదు. రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోలిస్తే హైదరాబాద్ జిల్లాలో రికార్డు స్థాయిలో 41.11 శాతం ఓట్లు తగ్గాయి. తొలగింపు ముప్పులో (అన్-కలెక్టబుల్) ఓట్లు 19,41,000 ఉన్నాయి. ప్రస్తుతం తగ్గినట్లు చూపిస్తున్న ఓట్లు శాశ్వతంగా తొలగించబడవని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి సెప్టెంబర్ 16 వరకు ఓటర్లకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల కాలపరిమితిని ఎన్నికల సంఘం కేటాయించింది. ఒకవేళ ముసాయిదా జా బితాలో పేరు లేకపోతే, ప్రజలు వెం టనే ఫారమ్-6 నింపి ఆన్‌లైన్ ద్వారా లేదా బీఎల్వోల ద్వారా తిరిగి తమ ఓటు హక్కును ఉచితంగా నమోదు చేసుకోవచ్చు. ఓటు వివరాలను పరిశీలించుకోవడానికి చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ తెలంగాణ అధికారిక పోర్ట ల్‌ను సందర్శించవచ్చు.

**అత్యధికంగా ఓట్లు తగ్గిన నియోజకవర్గాలు..**

నగరంలో ఐటీ ఉద్యోగులు, ఇళ్లు మారిన వారి సంఖ్య ఎక్కువగా ఉండడం, గ్రామాలు, నగరంలో రెండు చోట్ల ఓట్లున్న వారు ఇక్కడ సర్ ఫారాలు ఇవ్వకపోవడం తదితర కారణాలతో సనత్ నగర్ నియోజకవర్గంలో అత్యధికంగా, అంబర్ పేట నియోజకవర్గంలో అత్యల్పంగా ఓట్లు తగ్గాయి. సనత్ నగర్ సెగ్మెంట్ లో జిల్లాలోనే అత్యధికంగా 45.68 శాతంతో సుమారు 1.16 లక్షల ఓట్లు తగ్గే ముప్పును ఎదుర్కొంటున్నాయి. ఇక్కడ ఎన్యూమరేషన్ డిజిటలైజేషన్ కేవలం 53.52 శాతం మాత్రమే పూర్తయింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో 88,933 ఓటర్ల వివరాలు లభ్యం కాలేదు. ఈ ఓట్లన్నీ ఆబ్సెంట్/షిఫ్టెడ్, డెడ్ (ఏఎస్ డీ) జాబితాలోకి వెళ్లాయి. ముషీరాబాద్‌లో దాదాపు 46 శాతం అంటే 58,320 మంది ఓటర్ల ఆచూకీ క్షేత్రస్థాయిలో లభించలేదు. మలక్ పేట్ నియోజకవర్గంలోనూ 46 శాతం ఓటర్ల వివరాలు లభ్యం కాకపోవడం గమనార్హం. జిల్లాలో అత్యల్పంగా ఓట్లు తగ్గిన సెగ్మెంట్ గా అంబర్ పేట్ నిలిచింది. జిల్లాలో తగ్గిన ఓట్ల శాతం సగటు 41 కాగా.. ఇక్కడ కేవలం 14.98 శాతం ఉంది. అంబర్ పేట్ నియోజకగర్గంలో 85 శాతం ఓటర్లు విజయవంతంగా సర్ ప్రక్రియ ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించారు. ఇదిలా ఉండగా ఈ నెల 17న విడుదలయ్యే అధికారిక ముసాయిదా జాబితాలో ప్రతీ పోలింగ్ బూత్ వారీగా ఖచ్చితమైన సంఖ్య తెలిసే అవకాశం ఉంది.




# ఉప్పొంగిన అభిమానం.. గ్రామానికి కలెక్టర్ పేరు

**ఆదిలాబాద్,ఫ్లాష్ ఇండియా :** కల్లాకపటం తెలియని ఆదివాసీలు తమకు మేలు చేసిన వారిని గుండెల్లో పెట్టుకుని పూజిస్తారనడానికి ఆదిలాబాద్ జిల్లాలో చోటుచేసుకున్న ఈ అరుదైన ఘటనే నిదర్శనం. తమ సొంతింటి కలను నిజం చేసిన ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషాపై ఉన్న గౌరవం, కృతజ్ఞతలతో ఏకంగా తమ గ్రామానికే ఆయన పేరును పెట్టుకుని గిరిజనులు తమ అభిమానాన్ని చాటుకున్నారు.

**అసలేం జరిగిందంటే?**

ఆదిలాబాద్ గ్రామీణ మండలం పిప్పల్‌ధరి పంచాయతీ పరిధిలోని 'దహిగూడ'కు చెందిన గోండు గిరిజనులకు ప్రభుత్వ ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. అయితే ఇళ్లు నిర్మించుకోవడానికి సరైన స్థలం లేకపోవడంతో సొంత ఇంటి కల నెరవేరక తీవ్ర అవస్థలు పడుతున్న పరిస్థితిని గిరిజనులు జిల్లా కలెక్టర్ రాజర్షిషా దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన కలెక్టర్, వారికి ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వ భూమిని కేటాయించడమే కాకుండా 17 మంది లబ్ధిదారులకు పట్టాలను సైతం అందజేశారు. అంతటితో ఆగకుండా ఆ ప్రాంతంలో తాగునీటి సదుపాయంతో పాటు ఇతర మౌలిక వసతులను ఏర్పాటయ్యేలా అధికారులను ఆదేశించారు. తమ దశాబ్దాల కల నెరవేరడానికి కారణమైన కలెక్టర్ రాజర్షిషాపై ఉన్న అపారమైన గౌరవంతో గిరిజనులు తమ గ్రామానికి 'రాజర్షిషా గూడ' అని నామకరణం చేసుకున్నారు. గురువారం స్వయంగా ఆ గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్ రాజర్షిషాను అతిథి మర్యాదలతో ఘనంగా సత్కరించారు. అనంతరం తన పేరుతో ఏర్పాటు చేసిన 'రాజర్షిషా గూడ' బోర్డుకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు.

# తెలంగాణ, ఏపీకి ఎన్నంటే?

## పోలీసులకు సేవా పతకాలు ప్రకటించిన కేంద్రం..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో అసమాన ప్రతిభ, ధైర్య సాహసాలు ప్రదర్శించిన పోలీసు, అగ్నిమాపక, హోంగార్డు, పౌర రక్షణ విభాగాల సిబ్బందికి కేంద్ర హోంశాఖ సేవా పతకాలను ప్రకటించింది. దేశవ్యాప్తంగా మొత్తం 1,057 మంది అధికారులను ఈ పతకాల కోసం కేంద్ర హోం శాఖ ఎంపిక చేయగా వీరిలో 92 మంది రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలకు, 301 మందికి పోలీసు మెడల్ ఫర్ గ్యాలంట్రీ, 664 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలకు ఎంపిక అయ్యారు. గ్యాలంట్రీ పతకాలు సాధించిన 301 మందిలో అత్యధికంగా 197 మంది తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో సాహసోపేత సేవలు అందించిన వారు ఉన్నారు. జమ్మూకశ్మీర్‌కు చెందిన 51 మందికి, ఈశాన్య రాష్ట్రాలలోని 12 మంది పోలీసులకు ఈ పతకాలు దక్కాయి.

**తెలంగాణకు 15, ఏపీకి 21:**

కాగా, ఈ ప్రతిష్టాత్మక పతకాలకు ఆంధ్రప్రదేశ్ నుంచి 21, తెలంగాణ నుంచి 15 మంది ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి ఎంపికైన 15 మందిలో ముగ్గురు పోలీసులకు గ్యాలంట్రీ మెడల్స్, ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 10 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలు ప్రకటించారు. రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలను అదనపు డిప్యూటీ కమిషనర్ జోగుల నర్సయ్య, ఎస్పీ ఆర్. జగదీశ్వర్ రెడ్డి అందుకోనుండగా గ్యాలంట్రీ మెడల్స్ ను జూనియర్ కమాండోలు బి. సత్యరావు, కె. సందీప్ కుమార్, జె. వంశీకృష్ణ అందుకోబోతున్నారు. ఇక ఆంధ్రప్రదేశ్ పోలీసులలో ఏడుగురు పోలీసులకు గ్యాలంట్రీ మెడల్స్, ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 11 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలకు ఎంపికయ్యారు. ఏపీకి చెందిన ఐజీ గుడి విజయ్ కుమార్, ఐజీ బలంకారి వెంకట రామిరెడ్డి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలకు ఎంపిక కాగా.. గ్యాలంట్రీ మెడల్స్ కు హెడ్ కానిస్టేబుళ్లు కొర్లాన మహేశ్, పైడి శ్రీరామమూర్తి, అడారి హేమసుందర రావు, చింతపల్లి సత్యనారాయణ, రౌతు మహేశ్, ఆబోతుల అప్పలనాయుడు, రుతాల కన్నబాబు ఎంపికయ్యారు.

**సీబీఐ అధికారులకు 21 పతకాలు:**

కేంద్ర దర్యాప్తు సంస్థ లో పనిచేస్తున్న 21 మంది అధికారులకు పతకాలు దక్కాయి. ఇందులో ఆరుగురికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 15 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలకు ఎంపికయ్యారు. విశాఖపట్నం డీఎస్పీ (సీబీఐ)గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సంజయ్ కుమార్ సమాల్‌కు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం వరించింది.

# ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ చేయాలి





**జనగామ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జిల్లాలో వ్యవసాయ రంగ అభివృద్ధికి, రైతులకు అవసరమైన ఆర్థిక సహకారం అందించేందుకు బ్యాంకులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అధికారులను, బ్యాంకర్లను ఆదేశించారు. శుక్రవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అధ్యక్షతన జిల్లా సంప్రదింపుల కమిటీ (DCC) సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో బ్యాంకింగ్ రంగం ద్వారా అమలవుతున్న వివిధ కార్యక్రమాలు, రుణ లక్ష్యాలు, వ్యవసాయ రుణాల పంపిణీ, ప్రభుత్వ పథకాల పురోగతిపై క్షుణ్ణంగా సమీక్షించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ బ్యాంకుల వారీగా నిర్దేశించిన రుణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని సమీక్షిస్తూ.. వ్యవసాయ, పంట రుణాల పంపిణీలో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన సమయంలో రుణాలు అందేలా బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలని, అర్హత ఉన్న ప్రతి రైతుకు కిసాన్ క్రెడిట్ కార్డు (KCC), తదితర రుణ సదుపాయాలు అందేలా చూడాలని సూచించారు.

**స్వయం సహాయక సంఘాలకు రుణాలు**

మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా ఆర్థిక సహకారం అందించి, వారి జీవనోపాధి కార్యకలాపాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. అర్హత కలిగిన సంఘాల రుణ దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత సమయంలో పరిష్కరించాలని బ్యాంకర్లను ఆదేశించారు.

**ప్రభుత్వ పథకాల అమలులో వేగం పెంచాలి**

ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు బ్యాంకింగ్ సేవలు సక్రమంగా అందేలా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రత్యక్ష నగదు బదిలీ (DBT), ఖాతాల అనుసంధానం, తదితర అంశాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బ్యాంకులు, సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. బ్యాంకింగ్ సేవలు అందని (లేదా) తక్కువగా అందుతున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

**బ్యాంకుల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ**

బ్యాంకుల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతిని క్రమం తప్పకుండా సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. బ్యాంకుల పనితీరును స్కోర్ కార్డు ఆధారంగా పర్యవేక్షిస్తూ, వెనుకబడిన బ్యాంకులు లక్ష్యాలను సాధించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. వ్యవసాయం, పంట రుణాలు, చిన్న వ్యాపారాలు, స్వయం సహాయక సంఘాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు, తదితర రంగాల్లో రుణాల మంజూరీ, పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. రుణ దరఖాస్తుల పరిశీలనలో అనవసర జాప్యం చేయకుండా, అర్హత కలిగిన వారికి నిబంధనల మేరకు రుణాలు మంజూరు చేయాలని స్పష్టం చేశారు.

**అధికారుల సమన్వయంతో లక్ష్యాల సాధన**

జిల్లా స్థాయిలో బ్యాంకర్లు, లీడ్ బ్యాంక్ అధికారులు, నాబార్డ్, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. వివిధ బ్యాంకులు, శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న అంశాలను సమీక్షించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాలను కేవలం గణాంకాల పరంగా కాకుండా, వాటి ప్రయోజనాలు అర్హులైన రైతులు, మహిళా సంఘాలు, చిన్న వ్యాపారులు, ఇతర లబ్ధిదారులకు వాస్తవంగా అందేలా చూడాలని తెలిపారు. ఈ సమన్వయ సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రతిభ, డీఏఓ అంబికా సోనీ, డీఆర్డీఓ భాస్కర్, ఏపీడీ నూరుద్దీన్, ఏడీ ఎస్సీ కార్పొరేషన్ మాధవి లత, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, నాబార్డ్, ఇతర సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య గ్రామాల నిర్మాణమే ధ్యేయం



**మరిపెడ,ఫ్లాష్ ఇండియా :** ఆరోగ్య గ్రామాల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం, ఫాగింగ్, బ్లీచింగ్ చేయాలని ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. శుక్రవారం మరిపెడ ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు గత ఏడాది కాలముగా నిర్వహించిన పనులు, గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజా ప్రతినిధుల సమక్షంలో చదివి వినిపించారు. పలువురు సర్పంచులు తమ గ్రామాల్లో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించవల్సిందిగా అధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గడచిన రెండున్నరేళ్లలో గ్రామాల అభివృద్ధికి రూ.17 కోట్లు పంచాయతీ రాజ్ నుంచి, తన సొంత నిధులు ఎస్ డీఎఫ్ నుంచి రూ.2 కోట్లు, మంజూరు చేయించి గ్రామాల్లో జీపీ భవనాలు, వీవో భవనాలు, సీసీలు, డ్రైనేజీలు నిర్మించటం జరిగిందన్నారు. అదే విధంగా స్పెషల్ ఫండ్స్ రూ.4కోట్లతో లైట్లు, గ్రామాల్లో నెలకొని ఉన్న చిన్న చిన్న సమస్యలను పరిష్కరించామన్నారు. కాంగ్రెస్ హయాంలో గ్రామాల్లో ఏ సమస్య వచ్చినా వెను వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. ఎల్నినో ప్రభావంతో రానున్న రోజుల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారులు, విద్యుత్ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని, ఏ సమయంలో సమస్య అన్న స్పందించి వెంటనే పని చేయాలన్నారు. ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ నుంచి మంజూరైన రోడ్ల పనులను, భవనాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా మరిపెడ గ్రామంలో మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ కాలం సునీతా రవీందర్, పట్టణ అధ్యక్షుడు బానోతు రాంలాల్ తో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీమన్నారాయణ, తహసీల్దార్ కృష్ణవేణి, కేసముద్రం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెదబోయిన అయిమల్లు, అన్ని శాఖల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.



# హర్ ఘర్ తిరంగా

## ప్రతి ఇంటా జాతీయ జెండా భారీ ర్యాలీ

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా తేదీ : 14-8-2026,శుక్రవారం భారతీయ జనతా పార్టీ మిర్యాలగూడ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ ఫ్లై ఓవర్ నుండి రౌండ్ చౌరస్తా వరకు పట్టణ ప్రజలు విద్యార్థిని విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రావు పద్మ విచ్చేసి మాట్లాడుతూ దేశ సమగ్రతకు సార్వభౌమాధికారానికి హాని పెట్టాలని కానీ విదేశీ సొమ్ముతో ఈ దేశం లో అరాచకం చేయాలని చూసే విచ్ఛిన్న శక్తులు ఎవరైనా సరే వారికి భారత ప్రభుత్వం ఈ దేశ యువత సరైన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు బసవరాజు లక్ష్మీ నరసయ్య, బిజెపి నల్గొండ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాసరావు,గోలి మధుసూదన్ రెడ్డి.హర్ ఘర్ తిరంగా కార్యక్రమ నల్గొండ జిల్లా ఇన్చార్జ్ బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మైల నరసింహా, మిర్యాలగూడ వన్ టౌన్,టూ టౌన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బంటుగిరి, పెద్దబోయిన వెంకటేశ్వర్లు, కొంగరి వెంకటరమణ,మూల రాజిరెడ్డి,శ్రీకాంత్, సీనియర్ నాయకులు బంటు సైదులు రేపాల పురుషోత్తం రెడ్డి,ఎడ్ల రమేష్,తుమ్మలపల్లి హనుమంత్ రెడ్డి,కన్మంత్ రెడ్డి అశోక్ రెడ్డి,కొండేటి సరిత, చిలుకూరి రమాదేవి శ్యామ్,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వెలుగు ఇందిరా నాగరాజ్ చిల్లంచర్ల అభి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# యాదగిరి పల్లి పందిళ్ళపల్లి చెరువుకు ఫీడల్ ఛానల్ ఏర్పాటు చేయాలి...



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ పట్టణంలోని యాదగిరి పల్లి పందిళ్ళపల్లి చెరువుకు ఫీడర్ ఛానల్ ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో రమణారెడ్డికి మెమోరండం ఇవ్వటం జరిగింది ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యాద్గారి పెల్లి పందిళ్ళపల్లి చెరువు లో రోజు రోజుకు నీటిమట్టం తగ్గిపోతున్నాయి . దాని వలన చుట్టూ ప్రక్కల గ్రామాలు ఎటు 10 కిలోమీటర్ల దూరం వరకు భూగర్భ జలాలు రోజురోజుకు తగ్గిపోతా ఉన్నాయని వారన్నారు దానితోపాటు ఇండ్లలో ఉన్న బోర్లు,పొలాల్లో ఉన్న బోర్లు నీరు తగ్గడం వలన బోర్లు ఆగి ఆగి నీరు పోస్తున్నాయని వారన్నారు. యాదగిరి పెల్లి పందిళ్ళపల్లి చెరువుకు నాగర్జున సాగర్ ఎడమ కాలువకు గతంలో ఏడు కోట్ల తండా పక్కనుండి సాగునీరు వచ్చేటప్పుడు ఆ చెరువు నిండేదని ఇవ్వాళ ఆ ప్రాంతం మొత్తం రియల్ ఎస్టేట్ చేసి వ్యవసాయ భూములు మొత్తం ఇల్లు నిర్మించుకున్నారని రామచంద్ర గూడెం,చైతన్య నగర్,రామ్ నగర్,తాళ్లగడ్డ ఈ వ్యవసాయ భూములు మొత్తం ఇండ్లుగా మారిపోయినాయి ఇప్పుడు అక్కడ నుంచి నీరు వచ్చే పరిస్థితి లేదు కాబట్టి నేరుగా సాగర్ ఎడమకాల ద్వారా పందిళ్ల పెల్లి చెరువుకు ఫీడల్ చానల్ ఏర్పాటు చేసి అన్ని చెరువులతోపాటు ఈ చెరువును కూడా నింపవలసిన అధికారుల పైన ఉందని వారన్నారు. ఈ కార్యక్రమంలో వేములపల్లి మండల కార్యదర్శి జిల్లా యాదగిరి,యువజన సమాఖ్య నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు బస్కర్ల పరమేష్,ఆకారపులోకేష్,ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జిల్లా యశ్వంత్,మట్టయ్య,రాములు,శ్రీనివాసు,లింగయ్య,వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# లక్ష మందితో బహిరంగ సభ



**సంగారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** సంగారెడ్డిలో శనివారం జరగనున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి బహిరంగ సభ ఏర్పాట్లను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ సీఎం సభను లక్ష మంది హాజరుతో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సభ విజయవంతానికి పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామిలతో ప్రతిరోజూ సమీక్షలు జరుగుతున్నాయని వివరించారు. సంగారెడ్డి ఐబీ చౌరస్తాలో ముఖ్యమంత్రి మాజీ ప్రధానమంత్రులు జవహర్‌లాల్ నెహ్రూ, రాజీవ్‌గాంధీల విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. సభకు సంగారెడ్డి నియోజకవర్గం నుంచే దాదాపు 50 వేల మంది తరలివస్తారని ఆశిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం అరకొరగా రేషన్ కార్డులను పంపిణీ చేసిందని విమర్శించిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టిందని, రాష్ట్రవ్యాప్తంగా కోటి ఐదు లక్షల మందికి అందించనున్నట్లు తెలిపారు. సభ సమయంలో వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా జర్మన్ షెడ్లను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జార్జ్, నాయకులు కిరణ్ గౌడ్, కూన సంతోష్, షఫీ హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి



**జనగామ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అధికారులను ఆదేశించారు. ఈ నెల 15న సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఆవరణలో వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్, పార్కింగ్, వేదిక, సౌండ్ సిస్టం, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు తదితర ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. జాతీయ జెండా ఆవిష్కరణ, ప్రభుత్వ ప్రోటోకాల్‌ను తప్పనిసరిగా పాటించాలని, NCC, NSS, స్కౌట్స్ విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాలపై పుస్తకాన్ని సిద్ధం చేయాలని, ప్రశంసా పత్రాల పంపిణీకి ముందస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వేడుకలను డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించాలని, చివరి నిమిషంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

# జాతీయ రహదారికి భద్రతా చర్యలు





**జనగామ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిని జీరో ఫాటాలిటీ కారిడార్‌గా అభివృద్ధి చేసేందుకు అధికారులు సమగ్ర చర్యలు చేపడుతున్నారు. జనగామ జిల్లా పరిధిలోని సుమారు 46 కిలోమీటర్ల రహదారిని క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రమాదకర ప్రాంతాలు, బ్లాక్ స్పాట్లు, ప్రధాన జంక్షన్లు, మలుపులను గుర్తించారు. వరంగల్ సీపీ శ్వేత అధ్యక్షతన జరిగిన జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశంలో రహదారి భద్రతపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పల్లగుట్ట, మీదిగొండ, గోవర్ధనగిరి, రాఘవాపూర్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రమాదాల నివారణకు అవసరమైన చోట్ల మీడియన్ ఓపెనింగ్స్ మూసివేత, రంబుల్ స్ట్రిప్స్, డెలినేటర్లు, హెచ్చరిక బోర్డులు, రోడ్డు మార్కింగ్స్, క్రాష్ బారియర్లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే వీధి దీపాలు, సర్వీస్ రోడ్లు, జంక్షన్ల అభివృద్ధి, డ్రైనేజీ పనులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జీల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. రహదారిపై అనధికారిక పార్కింగ్, ఆక్రమణలు, అనుమతులు లేని కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంలో నిర్లక్ష్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ తెలిపారు. ప్రజల ప్రాణాలను కాపాడటమే ప్రధాన లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ సూచించారు.

# 1116 చీరలతో నిమిషాంబ దేవి విశేష అలంకరణ..



**మేడిపల్లి,ఫ్లాష్ ఇండియా :** శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా బోడుప్పల్‌లోని శ్రీ మాతా నిమిషాంబ దేవి ఆలయంలో అమ్మవారికి 1116 చీరలతో విశేష అలంకరణ నిర్వహించారు. శ్రీ హంపీ విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థానం, హంపి పీఠం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అమ్మవారు దేదీప్యమానంగా అలంకరించబడి భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయ పరిసరాలు నిమిషాంబ నామస్మరణతో మారుమోగాయి. శ్రావణ మాసంలో లక్ష్మీదేవిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే సుఖసంతోషాలు, సిరి సంపదలు, ఆయురారోగ్యాలు లభిస్తాయని భక్తుల విశ్వాసం. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కామరౌతు వినోద్‌కుమార్, సెట్లర్ కళావతి, ప్రధాన కార్యదర్శులు కె. అశోక్‌కుమార్, సంగు శ్రీనివాస్, కోశాధికారి ఎన్. రమేష్, రాష్ట్ర నకాష్ సంఘం ప్రధాన కార్యదర్శి కొరిచెర్ల శ్రీనివాస్‌రావుతో పాటు ట్రస్ట్ ధర్మకర్తలు, ఆలయ అర్చకులు చంద్రశేఖర్ శర్మ, ఉమాకాంత్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



# బావమరిది శ్రీనివాస్ రావుకు కేసీఆర్ కడసారి వీడ్కోలు

**కుత్బుల్లాపూర్,ఫ్లాష్ ఇండియా :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన బావమరిది జోగినపల్లి శ్రీనివాస్ రావు భౌతికకాయానికి నివాళులు అర్పించారు. ఎర్రవల్లి నుంచి సుచిత్రలోని ఆయన నివాసానికి చేరుకున్న కేసీఆర్, పార్థివ దేహం వద్ద అంజలి ఘటించి, తీవ్ర దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. 'మేమంతా మీకు అండగా ఉంటాం, ధైర్యంగా ఉండండి' అని భరోసా ఇచ్చారు. కేసీఆర్‌తో పాటు కేటీఆర్, హరీశ్ రావు తదితర పార్టీ ప్రముఖులు ఉన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వచ్చిన శ్రీనివాస్ రావు, గురువారం వేకువజామున కన్నుమూశారు.



# చెన్నై, కోల్‌కతా కాదు..


ఐపీఎల్ 2027లో టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఏ జట్టు తరపున ఆడతాడనే చర్చ రోజు-రోజుకూ ఆసక్తికరంగా మారుతోంది. 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ పేలవ ప్రదర్శన కారణంగా.. హార్దిక్ జట్టును వీడాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. కోల్‌కతా నైట్ రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్ వంటి జట్లు అతడిని తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నట్లు ప్రచారం జరిగింది. భారత మాజీ ఆల్‌రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ మాత్రం హార్దిక్ మరో జట్టులోకి వెళ్లొచ్చని అంచనా వేశాడు.హార్దిక్ పాండ్యా మాజీ ఫ్రాంచైజీ గుజరాత్ టైటాన్స్‌ను సంప్రదించినట్లు వార్తలు వచ్చాయి. ముంబై ఇండియన్స్ నుంచి తిరిగి గుజరాత్‌కు రావాలనే ఆసక్తి హార్దిక్ వ్యక్తం చేసినప్పటికీ.. కెప్టెన్సీ విషయంలో అతడు పెట్టిన షరతే డీల్‌కు అడ్డంకిగా మారిందని సమాచారం. అయితే కెప్టెన్సీ లేకపోయినా హార్దిక్ మళ్లీ టైటాన్స్‌కు వెళ్లే అవకాశం ఉందని ఆర్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు. యాష్ తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడుతూ.. 'గుజరాత్ టైటాన్స్‌ను హార్దిక్ సంప్రదించడం తప్పేమీ కాదు. టైటాన్స్‌లో అతడికి మంచి ట్రాక్ రికార్డు ఉంది. బ్యాటింగ్, కెప్టెన్సీ పరంగా అతడి కెరీర్‌లో అత్యుత్తమ దశ గుజరాత్ జట్టులోనే వచ్చింది. నాకు ఇప్పటికీ ఓ బలమైన నమ్మకం ఉంది.. హార్దిక్ మళ్లీ గుజరాత్ టైటాన్స్‌కు వెళ్లొచ్చు' అని అన్నాడు.2022 ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ అరంగేట్రం చేసింది. 2022, 2023 సీజన్లలో హార్దిక్ జట్టుకు నాయకత్వం వహించాడు. తొలి సీజన్‌లోనే టైటిల్ అందించడంతో పాటు.. 2023లో జట్టును ఫైనల్‌కు చేర్చాడు. ఆ తర్వాత ముంబై ఇండియన్స్‌కు తిరిగి వెళ్లిన హార్దిక్.. కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టినా ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోయాడు. అందుకే టైటాన్స్‌కు తిరిగి వెళ్లడం హార్దిక్‌కు మళ్లీ కలిసిరావొచ్చని ఆర్ అశ్విన్ జోస్యం చెప్పాడు. అక్కడి వికెట్లు బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండటం, తనకు అనుకూలమైన పరిసరాలు ఉండటం కూడా హార్దిక్‌కు ప్లస్ పాయింట్లని పేర్కొన్నాడు.గుజరాత్ టైటాన్స్‌కు హార్దిక్ తిరిగి వస్తే కెప్టెన్సీ మాత్రం దక్కకపోవచ్చని అశ్విన్ స్పష్టం చేశాడు. ప్రస్తుతం శుభ్‌మన్ గిల్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడని, గత రెండు సీజన్లలో అతడి నాయకత్వం బాగుందని చెప్పాడు. 'గుజరాత్ టైటాన్స్‌కు హార్దిక్ తిరిగి వెళ్తే అది అతడికి లక్ మరలా కలిసిరానుంది. కానీ కెప్టెన్సీ మాత్రం లభించదని అనుకుంటున్నాను. శుభ్‌మన్ గిల్ గత రెండేళ్లుగా అద్భుతంగా నాయకత్వం వహిస్తున్నాడు. అయినప్పటికీ అవకాశం వస్తే హార్దిక్ మళ్లీ గుజరాత్‌కు వెళ్లడాన్ని పరిగణించాలి. ఇది జరిగే అవకాశం ఉందని నాకు అనిపిస్తోంది' అని అశ్విన్ చెప్పాడు.ముంబై ఇండియన్స్‌లో విజయవంతం కాకపోయినా.. గుజరాత్ టైటాన్స్‌కు తిరిగి వెళ్లి మరోసారి తన సత్తా నిరూపించుకోవాలని హార్దిక్ చూస్తాడని అశ్విన్ పేర్కొన్నాడు. ముంబైతో ఈసారి టైటిల్ గెలవలేకపోయినా.. గుజరాత్‌తో మళ్లీ విజయం సాధించి తనను తాను నిరూపించుకోవాలనే పట్టుదల హార్దిక్‌లో ఉండొచ్చని చెప్పాడు. అయితే హార్దిక్ భవిష్యత్తుపై ఇప్పటివరకు అతడి నుంచి కానీ, ముంబై ఇండియన్స్ నుంచి కానీ అధికారిక ప్రకటన రాలేదు. ఐపీఎల్ 2026 తర్వాత ఓ భారీ ట్రేడ్ చోటుచేసుకుంది. రిషభ్ పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్‌కు వెళ్లగా.. కుల్దీప్ యాదవ్ లక్నో సూపర్ జెయింట్స్‌కు చేరాడు. ఇప్పుడు హార్దిక్ పాండ్యా తదుపరి గమ్యం కూడా ఖరారైతే.. ఐపీఎల్ ట్రేడింగ్‌లో మరో సంచలన అధ్యాయం కానుంది.

# బెంచ్‌లోనే ఆ నలుగురు!



శ్రీలంకతో శనివారం (ఆగష్టు 15) నుంచి గాలే వేదికగా ప్రారంభం కానున్న తొలి టెస్టుకు ముందు టీమిండియా తుది జట్టుపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. ప్లేయింగ్ 11 ఎలా ఉంటుందో అని అందరూ ఎదురుచూస్తున్నారు. తాజాగా భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ కీలక హింట్ ఇచ్చాడు. తొలి టెస్టులో టీమిండియా ముగ్గురు లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్లతో బరిలోకి దిగనుందని చెప్పకనే చెప్పాడు. కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా, మానవ్ సుతార్‌లను ఒకే మ్యాచ్‌లో ఆడించడం తమకు పెద్ద సమస్యగా అనిపించడం లేదని మోర్కెల్ స్పష్టం చేశాడు.గాలే పిచ్ మ్యాచ్ సాగేకొద్దీ స్పిన్‌కు మరింత అనుకూలించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో టీమిండియా ముగ్గురు స్పిన్నర్ల కాంబినేషన్‌ను ఎంచుకుంటే.. శ్రీలంక బ్యాటర్లపై మరింత ఒత్తిడి తీసుకురావచ్చని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోందట. మోర్నీ మోర్కెల్ మాట్లాడుతూ.. 'కుల్దీప్ యాదవ్ అటాకింగ్ బౌలర్. అతడి అనుభవం, నైపుణ్యాన్ని విస్మరించలేము. రవీంద్ర జడేజా కచ్చితమైన లైన్, లెంగ్త్‌తో బ్యాటర్లను ఇబ్బంది పెట్టగలడు. మానవ్ సుతార్ బంతిని ఎక్కువగా తిప్పగల ఎడమచేతి స్పిన్నర్. వీళ్ల ముగ్గురిలో ఒక్కొక్కరి బౌలింగ్ శైలి ఒక్కోలా ఉంటుంది. ముగ్గురు ఎడమచేతి స్పిన్నర్లను ఆడించడం మాకు పెద్ద సమస్యగా అనిపించడం లేదు' అని వివరించాడు.అయితే ఈ ముగ్గురిని కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఏ సమయంలో, ఎలా ఉపయోగిస్తాడనేదే కీలకమని మోర్కెల్ తెలిపాడు. 'మూడు విభిన్న స్పిన్ ఆప్షన్లు ఉండటంతో టీమిండియా 20 వికెట్లు పడగొట్టే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కుల్దీప్, జడేజా, మానవ్ తమదైన రోజున వికెట్ల వేట కొనసాగిస్తారు. గాలే మైదానంలో టెస్టు మ్యాచ్ సాగేకొద్దీ స్పిన్‌కు పిచ్ నుంచి ఎక్కువ సహకారం దక్కుతుంది. మ్యాచ్ తొలి రోజుల్లో బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్నా.. ఆపై బంతి టర్న్ అవుతూ బ్యాటర్లకు సవాల్ విసురుతుంది. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ముగ్గురు స్పిన్నర్లతో వెళ్లడం సరైన వ్యూహంగా అనిపిస్తోంది' అని మోర్కెల్ చెప్పుకొచ్చాడు.జస్ప్రీత్ బుమ్రా గైహాజరీలో మహ్మద్ సిరాజ్ పేస్ విభాగంను ముందుండి నడిపించనున్నాడు. అతడితో కలిసి కొత్త బంతిని పంచుకునే రెండో పేసర్‌గా ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్‌లో ఒకరిని ఎంచుకోవాల్సి ఉంది. 'ప్రసిద్ధ్, గుర్నూర్‌లకు టెస్టు అనుభవం పెద్దగా లేకపోయినా.. స్వదేశంలో కఠిన పరిస్థితుల్లో ఆడారు. శ్రీలంకలో ప్రధాన సవాలు వేడి, అధిక తేమ. కూకాబుర్రా బంతి 20 నుంచి 35 ఓవర్ల తర్వాత మెత్తబడే సమయంలో పేసర్లు తమ వ్యూహాన్ని మార్చుకోవాల్సి ఉంటుంది. క్రీజ్‌ను ఎలా ఉపయోగించాలి, షార్ట్ బాల్‌ను ఎప్పుడు ప్రయోగించాలి వంటి విషయాల్లో వేగంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రసిద్ధ్ అయినా, గుర్నూర్ అయినా.. ఎవరికి తుది అవకాశం లభించినా వారు తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించగలరు' అని మోర్కెల్ చెప్పాడు. గాలేలో భారత జట్టు కుల్దీప్, జడేజా, మానవ్ సుతార్‌లతో ముగ్గురు స్పిన్నర్ల కాంబినేషన్‌తో బరిలోకి దిగనునట్లు మోర్కెల్ చెప్పాడు.మొదటి టెస్టులో ముగ్గురు స్పిన్నర్లు, ఇద్దరు పేసర్లతో భారత్ బరిలోకి దిగనుందని బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ స్పష్టం చేశాడు. ఓపెనర్లుగా యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ ఆడనున్నారు. మూడో స్థానంలో దేవదత్ పడిక్కల్ ఆడనున్నాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నాలుగో స్థానంలో, ఐదులో రిషభ్ పంత్ ఆడుతాడు. ఆరులో సర్ఫరాజ్ ఖాన్ ఆడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. బౌలింగ్‌లో జడేజా రవీంద్ర, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్, మహ్మద్ సిరాజ్, గుర్నూర్ బ్రార్ ఆడే అవకాశాలు ఉన్నాయి. ధ్రువ్ జురెల్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకిబ్ నబీ, సారాంశ్ జైన్ బెంచ్‌లో ఉండనున్నారు. నబీ, సారాంశ్ అరంగేట్రం ఆలస్యం కానుంది.

# చాంపియన్లమనే ధోరణిలో ఉండాలి..



పాడీ ఆప్టన్..భారత క్రీడా జట్లతో అతడిది విడదీయరాని బంధం. 2011లో వన్డే వరల్డ్ కప్ గెలిచిన టీమిండియాకు, పారిస్ ఒలింపిక్స్‌లో చారిత్రక కాంస్య పతకం దక్కించుకున్న భారత పురుషుల హాకీ జట్టుకు అతడు మెంటల్ కండీషనింగ్ కోచ్‌గా పని చేశాడు. ప్రస్తుతం పురుషుల హాకీ జట్టుకు అదే బాధ్యతల్లో కొనసాగుతున్నాడు. మరో రెండు రోజుల్లో ప్రతిష్ఠాత్మక ప్రపంచ కప్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆప్టన్ మాట్లాడుతూ..మెగా టోర్నమెంట్‌కు ముందుగానే 'చాంపియన్ల' మనస్తత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించాడు. ఏదైనా ప్రధాన టోర్నమెంట్‌కు క్రికెటర్లను, హాకీ ఆటగాళ్లకు సంసిద్ధం చేయడంలో తేడా జట్టు డైనమిక్స్‌పై ఆధారపడి ఉంటుందన్నాడు. 'క్రికెట్‌లో ఆటగాళ్ల వ్యక్తిగత ప్రదర్శనపై ప్రధానంగా దృష్టి సారిస్తారు. కానీ హాకీలో జట్టు అంతా కలిసి రాణించడం ముఖ్యం. ఒక వ్యక్తి మనస్తత్వం ఇతరులపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది ఎంతో ముఖ్యం' అని ఆప్టన్ విరించాడు.

# బిజినెస్



## బంగారం ధరలు ఢమాల్..

ఎంతో విశిష్టంగా భావించే శ్రావణ మాసం ప్రారంభమైంది. ఈ మాసంలో శుభకార్యాలకు ముహూర్తాలు ఖరారు చేసుకుంటుంటారు. వివాహాది శుభకార్యాలతో పాటు పలు రకాల ఫంక్షన్స్ కూడా నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా బంగారం కొనుగోళ్లకు ఇంట్రెస్ట్ చూపిస్తుంటారు. మరి మీరు కూడా గోల్డ్ కొనే ప్లాన్ లో ఉన్నారా? అయితే మీకు గుడ్ న్యూస్. నేడు బంగారం ధరలు భారీగా తగ్గాయి. తులం గోల్డ్ ధర రూ. 710 తగ్గింది. కిలో వెండి ధర రూ. 5000 తగ్గింది.హైదరాబాద్‌లో నేటి బంగారం ధరలు.. 24 క్యారెట్ల బంగారం (99.9% స్వచ్ఛత) గ్రాముకు రూ.15,289, 22 క్యారెట్ల బంగారం (91.6% స్వచ్ఛత) గ్రాముకు రూ.14,015, 18 క్యారెట్ల బంగారం (75% స్వచ్ఛత) గ్రాముకు రూ.11,467గా సేల్ అవుతోంది. ఈ రోజు హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 710 పెరిగి రూ.1,52,890 వద్ద ట్రేడ్ అవుతోంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 650 పెరిగి రూ.1,40,150 వద్దకి చేరింది. ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,53,040 వద్ద అమ్ముడవుతోంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,40,300 వద్ద ట్రేడ్ అవుతోంది.హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో కిలో సిల్వర్ ధర రూ. 5000 తగ్గడంతో రూ.2,55,000 వద్ద సేల్ అవుతోంది. ఢిల్లీలో కిలో వెండి ధర రూ. 2,55,000 వద్దకి చేరింది.

## చైనాకు షాకిచ్చిన డొనాల్డ్ ట్రంప్..




అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డ్రోన్ల తయారీ, విక్రయాల రంగంలో చైనా ఆధిపత్యానికి చెక్ పెట్టేందుకు ఎవరూ ఊహించని నిర్ణయం తీసుకున్నారు. విదేశాల నుంచి అమెరికాలోకి దిగుమతి అయ్యే డ్రోన్లు, వాటి భాగాలపై ఏకంగా 100 శాతం వరకు టారిఫ్‌లు విధిస్తున్నట్లుగా ఇవాళ ప్రకటించారు. జాతీయ భద్రత, స్వదేశీ తయారీ రంగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకున్నట్లుగా వైట్‌హౌస్ వర్గాలు స్పష్టం చేశాయి.

**ఏ డ్రోన్లపై ఎంత పన్ను అంటే..**

వైట్‌హౌస్ అధికారుల సమాచారం మేరకు 25 కేజీల కంటే ఎక్కువ బరువు ఉండి, థర్మల్ ఇమేజర్లు, డాకింగ్ స్టేషన్లు వంటి జాతీయ భద్రతకు సంబంధించిన సామర్థ్యాలు ఉన్న అన్‌మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్స్ డ్రోన్ల దిగుమతిపై 100 శాతం పన్ను వర్తించనుంది. ఇక చిన్న తరహా డ్రోన్లపై 25 శాతం సుంకాన్ని విధించనున్నారు. ఈ కొత్త పన్ను నిబంధనలు సెప్టెంబర్ 3 నుంచి అమలుల్లోకి రానున్నాయి.

అయితే,

ప్రస్తుతం ప్రపంచ డ్రోన్ల మార్కెట్‌లో చైనాకు చెందిన 'DJI' కంపెనీ దాదాపు మూడింట రెండు వంతుల మార్కెట్‌ను కలిగి ఉంది. అమెరికా విదేశీ డ్రోన్లపై పూర్తిగా ఆధారపడటాన్ని తగ్గించి, స్థానికంగా డ్రోన్ల ఉత్పత్తిని, సరఫరా వ్యవస్థను పెంపొందించడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.




## భారతీయుల ఆల్‌టైమ్ ఫేవరెట్ 'పార్లే'

దేశీయ వినియోగదారులు అత్యధికంగా కొనుగోలు చేసే రోజువారీ వినియోగ వస్తువుల (ఎఫ్ఎంసీజీ) రేసులో పార్లే, బ్రిటానియా కంపెనీలు తమ ఆధిక్యాన్ని మరోసారి చాటుకున్నాయి. వరల్డ్‌ప్యానెల్ బై న్యూమరేటర్ విడుదల చేసిన 'బ్రాండ్ ఫుట్‌ప్రింట్ ఇండియా 2026' నివేదిక ప్రకారం, భారతీయ ఇళ్లలో అత్యధికంగా ఎంచుకోబడిన బ్రాండ్‌గా పార్లే ప్రొడక్ట్స్ వరుసగా 14వ సంవత్సరం కూడా నంబర్ 1 స్థానంలో నిలిచింది. ఒక ఏడాదిలో ఎంతమంది కస్టమర్లు కొన్నారు, ఎన్నిసార్లు కొన్నారు అనే 'కన్స్యూమర్ రీచ్ పాయింట్స్ (సీఆర్‌పీ)' ఆధారంగా రూపొందించిన ఈ జాబితాలో పార్లే 851.5 కోట్ల సీఆర్‌పీలతో అగ్రస్థానంలో నిలవగా, బ్రిటానియా, అముల్, క్లినిక్ ప్లస్, సర్ఫ్ ఎక్సెల్ తదుపరి స్థానాల్లో నిలిచాయి. నాణ్యత, సరసమైన ధర, దేశంలో 90 శాతానికి పైగా ఇళ్లకు సరుకులను చేరవేసే బలమైన పంపిణీ వ్యవస్థే పార్లే విజరహస్యమని విశ్లేషకులు చెబుతున్నారు.

**మారుతున్న ట్రెండ్స్**

ఇంటి బయట తినే (అవుట్-ఆఫ్-హోమ్) ఆహార పదార్థాల విభాగంలో బ్రిటానియా 61.9 కోట్ల సీఆర్‌పీలతో అగ్రస్థానాన్ని కైవసం చేసుకోగా, బాలాజీ వేఫర్స్, హల్దీరామ్స్, క్యాడ్‌బరీ, అమూల్ వరుసగా టాప్-5లో నిలిచాయి. తొలిసారిగా అమూల్ బ్రాండ్ అవుట్-ఆఫ్-హోమ్ విభాగంలో టాప్-5లోకి ప్రవేశించడం విశేషం. కాగా, ఇన్-హోమ్ విభాగంలో బాలాజీ తొలిసారిగా టాప్-10లోకి చేరడం, సర్ఫ్ సబ్బుల బ్రాండ్ 'రిన్' రెండేళ్ల తర్వాత తిరిగి టాప్-25లో చోటు సాధించడం, రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ వారి 'క్యాంపా' అత్యంత వేగంగా విస్తరించిన బ్రాండ్‌గా నిలవడం ఈ ఏడాది నివేదికలోని ముఖ్యమైన విశేషాలు.

## పూర్తిగా మారిపోయిన ఇన్‌స్టాగ్రామ్..




ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ఇన్ స్టాగ్రామ్‌లో మెటా కొన్ని మార్పులు చేయడంతో పాటు యాప్ లోగోను సైతం మార్చింది. దాదాపు పదేళ్ల తరవాత ఇన్ స్టాగ్రామ్ లోగోను మార్చారు. చివరగా 2016 ఇన్ స్టాలోగో డిజైన్ అప్ డేట్ చేయగా తాజాగా సరికొత్త డిజైన్ లోగోతో ఆకట్టుకుంటోంది. ఇది వరకు ఉన్న లోగో ఇంద్రధనస్సు రంగులతో కనిపించేది. కాగా తాజా లోగో కేవలం తెలుపు రంగులో కనిపిస్తోంది. అంతేకాకుండా తాజాగా కీలక అప్డేట్ తీసుకువచ్చింది. ఈ అప్డేట్‌లో ఇన్‌స్టా యాప్ మధ్యలో ఉన్న లోగోపై క్లిక్ చేస్తే ఫాలోయింగ్, ఫేవరెట్స్ అనే రెండు ఆప్షన్స్ కనిపిస్తున్నాయి.ఇక్క ఫాలోయింగ్ పై క్లిక్ చేస్తే మనం ఫాలో చేస్తున్న వారి పోస్టులు మాత్రమే కనిపిస్తాయి. అంతేకాకుండా ఫేవరెట్స్ లో మనం ఖచ్చితంగా చూడాలి అనుకున్నవారి అకౌంట్స్ మాత్రమే యాడ్ చేసుకుని మిస్ కాకుండా చూడొచ్చు. మరోవైపు యాప్ బ్యాగ్రౌండ్ కూడా పూర్తిగా నలుపు రంగలోకి మారిపోయింది. చూడ్డానికి కొత్త అప్డేట్ థ్రెడ్స్ యాప్ ను పోలి ఉంది. ఇక ఇది వరకు రీల్స్, ఫోటోలు షేర్ చేయాలి అంటే కింది భాగంలో మధ్యలో ఆప్షన్ కనిపించేది. కానీ ఇప్పుడు స్టోరీ షేర్ చేసే ఆప్షన్ లోనే రీల్స్, ఫోటోలు షేర్ చేసే ఆప్షన్ ఇచ్చారు. అదే విధంగా సెర్చ్ ఆప్షన్ కింది భాగంలో ఇచ్చారు.





# ఆ పాత్ర కోసం మారడానికి ఇబ్బందిగా అనిపించింది

కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ సినిమా 'అగధ'. శ్రీ ఆదివరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అజయ్ కేఆర్ సమర్పణలో, కాశీ విశాలాక్షి బలుసు ఈ చిత్రాన్ని నిర్మించారు. సీనియర్ దర్శకుడు ఎం.ఎస్. రాజు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో జోవికా విజయ్ కుమార్, భాను చందర్, షిజు, వనిత విజయ్ కుమార్, రోషన్ బషీర్, శ్రేయా రాణి రెడ్డి, వివా రాఘవ, రాబర్ట్ మాస్టర్, ఆర్నా మలేర్, కనకవ్వ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఆగస్ట్ 14న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఒక ఇంటర్వ్యూలో కామాక్షి భాస్కర్ల తన పాత్ర గురించి, కెరీర్ ఎంపికల గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ సినిమాలో తాను పోషించిన 'మహాదేవి' పాత్రలోకి మారడానికి తనకు చాలా సమయం పట్టిందని కామాక్షి వెల్లడించారు. తన వ్యక్తిగత అలవాట్లను, సూత్రాలను పక్కన పెట్టి ఆ పాత్రలో ఒదిగిపోవడానికి మొదట్లో కాస్త ఇబ్బందిగా అనిపించినా, దేవుడి అనుగ్రహంతోనే ఇలాంటి గొప్ప పాత్రలు లభిస్తాయని చెప్పారు. ఈ క్యారెక్టర్ కోసం బుద్ధిజం పుస్తకాలు చదివానని, బ్లాక్ మ్యాజిక్ గురించి విషయాలు తెలుసుకున్నానని తెలిపారు.

# భారీ షెడ్యూల్ పూర్తి చేసుకున్న భోగి..

శర్వానంద్ - సంపత్ నంది కాంబినేషన్‌లో 'భోగి' అనే పవర్‌ఫుల్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాను ఆగస్టు 28న విడుదల చేయనున్నారు. సినిమా విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో తాజాగా ఈ మూవీకి సంబంధించిన అత్యంత కీలకమైన షెడ్యూల్‌ను పూర్తి చేసినట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ షెడ్యూల్‌తో మూవీకి సంబంధించిన మేజర్ పార్ట్ కంప్లీట్ అయినట్లు సమాచారం. ఈ మూవీలో శర్వానంద్ మునుపెన్నడూ కనిపించని విధంగా మాస్ లుక్‌లో కనిపించనున్నాడు. దాంతో ఈ సినిమాపై మాస్ ఆడియన్స్‌లో మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఇక అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి ఇందులో హీరోయిన్లుగా కనిపించనుండగా, భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై నిర్మాత కె.కె. రాధామోహన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.








# బ్యాక్ టు బ్యాక్ షూటింగ్స్..

సూపర్‌స్టార్ రజినీకాంత్ ప్రధాన పాత్రలో, ప్రముఖ నటుడు, నిర్మాత కమల్ హాసన్ నిర్మాణంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ధర్మన్'. తాజాగా ఈ సినిమా సెకండ్ షెడ్యూల్‌కు సంబంధించిన వార్త నెట్టింట దర్శనమిచ్చింది. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ షెడ్యూల్ విజయవంతంగా పూర్తి చేసుకోగా.. తాజాగా రెండో షెడ్యూల్ చిత్రీకరణ చెన్నైలో గ్రాండ్‌గా ప్రారంభమైంది. ఇందుకు సంబంధించిన వీడియోతో పాటు, ఓ పోస్టర్‌ను కూడా మేకర్స్ రిలీజ్ చెయ్యగా.. ఫ్యాన్స్ 'వెయిటింగ్' అంటూ కామెంట్స్ చేస్తున్నారు. అశ్వథ్ మారిమ-ుత్తు దర్శకత్వంలో 'ది డెడ్లీ డాక్టర్' అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఇందులో రజినీకాంత్ డాక్టర్ పాత్రలో కనిపించనుండగా.. సిమ్రాన్, రాశీ ఖన్నా, యోగి బాబు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ సెకండ్ షెడ్యూల్ విశేషాలతో విపరీతమైన బజ్ నెట్టింట క్రియేట్ అయ్యి సినిమాపై హైప్ పెంచుతోంది. కాగా.. ధర్మన్ చిత్రాన్ని 2027 సంక్రాంతి స్పెషల్‌గా జనవరిలో తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తుండగా.. జైలర్ 2026 అక్టోబర్‌లో విడుదల కానుంది. దీంతో బ్యాక్ టు బ్యాక్ షూటింగ్‌లో పాల్గొంటూ సందడి చేస్తున్నారు రజిని.

# సూపర్బ్ ఫస్టాఫ్.. సెకండాఫ్?

కరుప్పు సూపర్ హిట్ తో సాలిడ్ కంబ్యాక్ ఇచ్చిన సూర్య నెలల గ్యాప్ లోనే 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చాడు. సితార ఎంటర్టైన్మెంట్స్ తెరకెక్కించిన ఈ సినిమా ఓవర్సీస్ లో ప్రీమియర్స్ తో రిలీజ్ అయింది. కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా వచ్చిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఓవర్సీస్ ఆడియెన్స్ టాక్ ఎలా ఉందంటేసినిమా ప్రారంభం సుమారు 20 నిమిషాలు స్లో నరేషన్ లో సాగుతుంది. ఎప్పుడైతే కథలోకి వెళ్తుందో అక్కడి నుండి ఇంటర్వెల్ వరకు సూపర్బ్ ఫిల్ ఇస్తుంది. కథలోకి వెళ్లేకొద్దీ ఆకట్టుకుంటుంది. ప్రథమార్థం పూర్తిగా కథాంశం చుట్టూనే సాగుతూ, మంచి కామెడీ మరియు ఎమోషన్స్‌తో ప్రేక్షకులను బాగా అలరిస్తుంది. విశ్వనాథ్ అండ్ సన్స్ మొదటి భాగం మాంచి ఫీల్ గుడ్ మూవీలా అనిపిస్తుంది. ఇక సెకండాఫ్ కూడా డీసెంట్ గా నీట్ ఉంటుంది, ఒక చక్కటి క్లైమాక్స్ తో సినిమా ముగుస్తుంది. అయితే అనవసరమైన సబ్-ప్లాట్స్, మెలోడ్రామా కాస్త ఎక్కువైన ఫిలింగ్ కలుగుతుంది. అక్కడకక్కడ సాగతీసినట్టు అనిపిస్తుంది. రన్ టైమ్ కాస్త తగ్గించి ఉంటె ఇంకా బాగుండేది.సూర్య తన వయసుకు తగ్గ పాత్రలో సూపర్బ్ పర్ఫామెన్స్ చేసాడు. ఒక కీలకమైన భావోద్వేగ సన్నివేశంలో సూర్య యాక్టింగ్ కు ఆడియెన్స్ నుండి క్లాప్స్ పడతాయి. రాధిక, మమిత నటనతో అదరగొట్టారు. వెంకీ అట్లూరి మాటలు ఈ సినిమాకి అతిపెద్ద బలం. సంభాషణలు చాలా సహజంగా, హృదయానికి హత్తుకునేలా ఉన్నాయి. సంగీతం పర్వాలేదనిపిస్తుంది. రెండో సగంలో మరిన్ని మంచి సన్నివేశాలు రాసుకుని ఉంటే ఈ సినిమా రేంజ్ వేరేలా ఉండేది. ఏదేమైనా, ఎక్కడా అసభ్యత లేని ఒక 'క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్'గా ఈ వారాంతంలో ఫ్యామిలీతో ఆస్వాదించదగిన సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్'. సూర్య ఖాతాలో మరో హిట్.






# ఫుల్ యాక్షన్ మోడ్‌లో తాప్సీ..

తాప్సీ పన్ను ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'గాంధారి'. ఇష్వాక్ సింగ్, స్వస్తిక ముఖర్జీ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ మూవీకి దేవాశిష్ మఖిజా దర్శకత్వం వహిస్తున్నాడు. కథ పిక్చర్స్ బ్యానర్‌పై తెరకెక్కుతోన్న ఈ యాక్షన్ థ్రిల్లర్ మూవీ త్వరలో నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతున్నది. ఈ క్రమంలోనే తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ అప్డేట్ నెట్టింట వైరల్ అవుతున్నది. ఈ సినిమా కోసం తాప్సీ శారీరకంగా ఎంతో శ్రమ చేస్తున్నట్లు తెలుస్తోంది. మహాభారతంలోని గాంధారి పాత్ర స్ఫూర్తితో, ఆధునిక సమాజంలో ఒక తల్లి, అలాగే భార్య కోణంలో ఎదురయ్యే భావోద్వేగ ప్రాధాన్యతల్ని నేటి శైలిలో ఈ సినిమాలో చూపించనున్నారు. విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం తాప్సీ కెరీర్‌లో మరొక ప్రత్యేకమైన ప్రాజెక్ట్‌గా నిలవనుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అందుకోసమే ఈ సినిమాలోని యాక్షన్ సన్నివేశాల కోసం తాప్సీ కష్టపడుతూ తనను తాను మేకోవర్ చేసుకుంటుందని తెలుస్తుండగా.. అందుకు సంబంధించిన ఫొటో ఒకటి నెట్టింట వైరల్ అవుతూ సందడి చేస్తుంది. దీంతో ఈ సినిమా తాప్సీకి నిజంగా మంచి కమ్ బ్యాక్ ఇస్తుందంటూ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు నెటిజన్లు.

# వారంలోనే ఆ రేర్ మార్క్!

అక్కినేని అఖిల్ తన తొలి విజయాన్ని 'లెనిన్' చిత్రంతో అందుకున్నారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకోగా, గత వారం ప్రముఖ ఓటీటీ వేదిక 'జీ5'లోకి ఎంట్రీ ఇచ్చింది. ఓటీటీలోనూ ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా 'జీ5' సంస్థ 'లెనిన్' సినిమా కేవలం వారం రోజుల్లోనే 200 మిలియన్లకు పైగా స్ట్రీమింగ్ మినిట్స్‌ను సొంతం చేసుకుని 'రాయల్ రాంపేజ్' సృష్టించినట్లు ప్రకటించింది. బాక్సాఫీస్‌తో పాటు ఓటీటీలోనూ ఈ సినిమా సత్తా చాటుతుండటంతో అక్కినేని అభిమానులు ఫుల్ ఖుషీలో ఉన్నారు. ఈ చిత్రంలో అఖిల్‌కు జోడీగా యంగ్ టాలెంటెడ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే నటించారు. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించిన ఈ సినిమాకు ఎస్.ఎస్. థమన్ సంగీతం అందించారు. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా నిర్మించారు.




# ఓటీటీ ఎంట్రీకి రెడీ అయిన 'ఉన్మాదం'..



మలయాళ స్టార్ నటుడు కుంచాకో బోబన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఉన్మాదం'. కిరణ్ దాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కుమార్ మంగత్ పాఠక్, అభిషేక్ పాఠక్ నిర్మించారు. కొంతకాలం క్రితం థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఇక ఈ సినిమా ఓటీటీ విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమా డిజిటల్ హక్కులను సోనీ లివ్ సంస్థ దక్కించుకుంది. అందులో భాగంగా మరికొన్ని రోజుల్లోనే ఈ సినిమాను మలయాళంతో పాటు తమిళ్, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ చేయనున్నట్లు ఈ సంస్థ అధికారికంగా ప్రకటించింది. మలయాళ ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో ఫుల్‌గా సక్సెస్ అయిన ఈ చిత్రం ఇతర భాషల ప్రేక్షకులను ఏ స్థాయిలో అలరిస్తుందో చూడాలి.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**